# క్రైమ్ THE మిర్రర్ ®

Voice of Anti Corruption

హైదరాబాద్
26-4-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 36

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## దటీజ్

# కవిత!

## అన్నంత పనిచేసిన కేసీఆర్ తనయ

### తెలంగాణ రాష్ట్ర సేన ఏర్పాటు.. టిఆర్ఎస్ పునరుద్ధరణ

### తేలిగ్గా తీసుకొని.. షాక్ తిన్న గులాబీ పార్టీ అగ్ర నేతలు

కల్వకుంట్ల కవిత.. తెలంగాణ పాలిటిక్స్ లో సరికొత్త సంచలనంగా మారారు. అనంత పని చేసి చూపించారు. తన పార్టీ పేరును తెలంగాణ రాష్ట్ర సేనగా ప్రకటించారు. టీఆర్ఎస్ ను పునరుద్ధరించినంత పని చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితిగా ప్రకటించడానికి సాంకేతిక ఇబ్బందులు రావడంతో.. తెలంగాణ రాష్ట్ర సేనగా ప్రకటించారు. మేడ్చల్ లో భారీ బహిరంగ సభ నిర్వహించి తన కొత్త పార్టీ పేరును ప్రకటించారు. ఆవిర్భావ సభకు రాష్ట్రవ్యాప్తంగా జన సమీకరణ చేశారు.



మిగతా 2లో

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించిన ఈ సభకు 50 వేలకు మించి ప్రజలు హాజరై ఉంటారని అంచనా. కేవలం పార్టీ మాత్రమే కాదు పార్టీ జెండాను కూడా ఆవిష్కరించి సరికొత్త రికార్డు సృష్టించారు కవిత.

**పక్కా వ్యూహంతోనే..**

కవిత పక్కా వ్యూహంతోనే అడుగులు వేసినట్లు స్పష్టం అవుతుంది. తెలంగాణ రాష్ట్ర సేనగా ప్రకటించి అందరి అంచనాలను తారుమారు చేశారు. మహారాష్ట్రలో

- మిగతా 2,8వ పేజీలో



## కవిత 'పాంచజన్యం'

**ఐదు హామీలను ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు**

**యువత, మహిళలే టార్గెట్**

# రేవంత్ ఉడుం పట్టు!



### ఎమ్మెల్సీగా అజారుద్దీన్..ప్రొఫెసర్ కోదండరాం సైతం

### గవర్నర్ ఒప్పించడంలో తెలంగాణ సీఎం సక్సెస్

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాజకీయంగా మరోసారి పైచేయి సాధించారు. తాను అనుకున్న విధంగా ఇద్దరికీ ఎమ్మెల్సీ పదవులు ఇప్పించుకున్నారు. గవర్నర్ కోట ఎమ్మెల్సీలుగా మహమ్మద్ అజారుద్దీన్, ప్రొఫెసర్ కోదండరాముల పేర్లను ఖరారు చేస్తూ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల సంతకం చేశారు. దీంతో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న మహమ్మద్ అజారుద్దీన్ పదవికి పొంచి ఉన్న గండం ఈ నిర్ణయంతో తొలగిపోయింది.





**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ఈనెల 30తో మంత్రి పదవి తీసుకొని ఆరు నెలలు అవుతుంది. అజారుద్దీన్ కె చట్టసభలో సభ్యుడు కారు. దీంతో ఆయన పదవికి గండం ఏర్పడింది. కానీ నాలుగు రోజులు ముందే గవర్నర్ ఆమోదం లభించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మార్కు రాజకీయం పనిచేసినట్లు అయింది.

**జూబ్లీహిల్స్ బై పోల్స్ లో..**

జూబ్లీహిల్స్ బై పోల్స్ లో కాంగ్రెస్ పార్టీ గెలిచేందుకు.. మైనారిటీ ఓటు బ్యాంకును కొల్లగొట్టేందుకు మహమ్మద్ అజారుద్దీన్ ను క్యాబినెట్ లోకి తీసుకున్నారు సీఎం రేవంత్ రెడ్డి. అప్పటికి అజారుద్దీన్ చట్టసభలో సభ్యుడు కాదు. అయితే ఎప్పుడైతే

- మిగతా 2వ పేజీలో

## తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1

**జెండా ఊపి ప్రారంభించిన సీఎం రేవంత్**





# వైసీపీలోకి రఘువీరా రెడ్డి



**జగన్మోహన్ రెడ్డి కీలక ప్రతిపాదన**

**పునరాలోచనలో కాంగ్రెస్ సీనియర్ నేత**

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రఘువీరారెడ్డి వైసీపీలో చేరుతారా? ఈ మేరకు చర్చలు పూర్తయ్యాయా? జగన్మోహన్ రెడ్డి తో కలిసి పని చేసేందుకు ఆయన సిద్ధపడ్డారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి.

2లో



## షర్మిలకు షాక్!

**ఏపీ కాంగ్రెస్ పగ్గాల నుంచి ఔట్**

**హై కమాండ్ కు ఫిర్యాదులు**

**తెరపైకి సుంకర పద్మశ్రీ పేరు**

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో రాజకీయ కీలక పరిణామం. కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ఉన్న షర్మిల మార్పు తథ్యం అన్న ప్రచారం నడుస్తోంది. ఆమె స్థానంలో కొత్త వారి ఎంపిక ఉంటుందన్న ప్రచారం నడుస్తోంది. ప్రధానంగా

మిగతా 8లో

## మహిళ విద్యా,ఉపాధిపై ప్రభుత్వం దృష్టి

లాభదాయక వ్యాపారాలపై దృష్టి సారించాలి

టీనేజ్ బాలికల కోసం స్నేహా సమ్మర్ ప్రోగ్రామ్

మంత్రి సీతక్క వెల్లడి

మిగతా 2లో

## అబద్దాల ప్రచారంలో సజ్జల దిట్ట



**జగన్ హయాంలో రైతులు ఆత్మహత్యలు**

**నేడు వ్యవసాయానని పండగచేసి చూపుతున్నాం**

**సజ్జల వ్యాఖ్యలపై మండిపడ్డ అచ్చన్నాయుడు**

## తెలంగాణలో నేటి నుంచి సెల్ఫ్-ఎన్యుమరేషన్

**వెబ్‌సైట్ ద్వారా వివరాలు అందచేసే అవకాశం**

**కులగణనతో పాటు జనగణన ఈసారి ప్రత్యేకం**

**జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతీ హోళికెరి**

మిగతా 2లో



## మే 5నుంచి బెంగాల్లో మహిళలకు స్వేచ్ఛ

**రాత్రి ఒంటిగంట తరవాత కూడా స్వేచ్ఛగా రావచ్చు**

**ఎన్నికల ప్రచారంలో కేంద్రహోంమంత్రి అమిత్ షా**



మిగతా 2లో

## అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం

**ఎన్నికల హామీలు నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నాం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**

**27 న రెవెన్యూ,హౌసింగ్ అంశాలపై మంత్రి సమీక్షలు**

**ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా సమావేశాలు**



# అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం

హైదరాబాద్,ఏప్రిల్25(ఆర్ఎన్ఎ): బీఆర్ఎస్ పాలనలో అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తూ ముందుకు వెళ్తున్నామని రెవెన్యూ మంత్రి పొంగులేటి తెలిపారు. గత ప్రభుత్వం ప్రారంభించిన పథకాలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షం చేస్తున్న అసత్య ఆరోపణలను లెక్కచేయకుండా, పేదవాడే ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వివరించారు. భూములకు సంబంధించిన సమస్యలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని పొంగులేటి తెలిపారు. వచ్చే 50 రోజుల్లో సాదాబైనామా అంశాల్లో న్యాయమైన సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు న్యాయం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, హసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం నుండి క్షేత్రస్థాయి సమీక్షలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు హిమాయత్‌నగర్ లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మధ్యాహ్నం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సంబంధించి ఇటువంటి సమావేశాలను దశలవారీగా నిర్వహించనున్నారు. రాష్ట్రంలో తొలి విడతగా మూడున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు. సుమారు లక్షకు పైగా ఇళ్ళు గృహ ప్రవేశాలకు సిద్దమైన నేపథ్యంలో మంత్రి గారు నిర్వహించే ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పూర్తి, కేటాయింపు, మౌలిక వసతుల కల్పన వంటి విషయాలను కూడా చర్చించనున్నారు. అంతేగాక త్వరలో రెండవ విడత ఇళ్ల మంజూరుకు సంబంధించి కూడా ఈ సమావేశంలో చర్చించే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా భూ వివాదాలు, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ,తాజాగా అమలు చేస్తున్న భూధార్ , సర్వేమ్యాప్‌ల వంటి కీలక రెవెన్యూ అంశాలపై జిల్లా అధికారులతో మంత్రి చర్చించనున్నారు. ఈ సమావేశంలో ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారు. అలాగే జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా హౌసింగ్ అధికారులు పాల్గొననున్నారు.

# వైసీపీలోకి రఘువీరా రెడ్డి

కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న రఘువీరారెడ్డి గత కొంతకాలంగా సైలెంట్ గా ఉన్నారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. షర్మిల తీరుపై ఆగ్రహంగా ఉన్న ఆయన వైసీపీలోకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. జగన్మోహన్ రెడ్డి సైతం సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో రఘువీరారెడ్డి వైసీపీలో చేరేందుకు దాదాపు నిర్ణయించుకున్నట్లు సమాచారం.

**సుదీర్ఘ నేపథ్యం..**

రఘువీరారెడ్డి సీనియర్ మోస్ట్ లీడర్. కాంగ్రెస్ పార్టీలోనే సుదీర్ఘకాలం కొనసాగుతూ వస్తున్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ఆ పార్టీని వీడలేదు కూడా. 1985లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1989లో మడకశిర నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలిచారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి మంత్రివర్గంలో పశుసంవర్ధక శాఖ మంత్రిగా పనిచేశారు. 1994లో మాత్రం ఓడిపోయారు. 1999లో మరోసారి గెలిచారు. 2004 ఎన్నికల్లో గెలిచి వైయస్ రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో ఈసారి కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో వ్యవసాయ శాఖను నిర్వర్తించారు మరోసారి. అటు తరువాత రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వాల్లో సైతం మంత్రిగా వ్యవహరిస్తూ వచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2023 నుంచి మాత్రం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా జాతీయ కార్యవర్గంలో కొనసాగుతూ వస్తున్నారు.

**ప్రస్తుతం కాంగ్రెస్ లోనే..**

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఉన్న రఘువీరారెడ్డి ఏమంత క్రియాశీలకంగా లేరు. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఈ తరుణంలో కాంగ్రెస్ పార్టీ నుంచి మిగిలి ఉన్న సీనియర్లను తెచ్చుకునేందుకు జగన్మోహన్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ సైతం పెద్దగా పుంజుకోవడం లేదు. జాతీయస్థాయిలో కూడా పార్టీ ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటుంది. అందుకే రఘువీరారెడ్డి పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. త్వరలో ఆయన వైసీపీలో చేరడం ఖాయమని ప్రచారంలో ఉంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# దట్ ఈజ్ కవిత!

(మొదటి పేజీ తరువాయి)

శివసేన మాదిరిగా ప్రాంతీయ అస్తిత్వం కోసం కచ్చితంగా తెలంగాణ రాష్ట్ర సేన పోరాడుతుందని సంకేతాలు పంపించగలరు. కేవలం రాజకీయాల కోసమే తెలంగాణ రాష్ట్ర సేన ఆవిర్భవించలేదని.. తెలంగాణ హక్కులను కాపాడే ఒక రక్షణ కవచంల ఆ పార్టీ పనిచేస్తుందని ఆమె స్పష్టం చేశారు. భారత రాష్ట్ర సమితి జాతీయ పార్టీగా మారిన క్రమంలో.. తెలంగాణ గుండె చప్పుడు వినిపించే అసలైన ప్రాంతీయ పార్టీ తమదే అన్నట్టు తెలంగాణ రాష్ట్ర సేనను ప్రకటించారు కవిత. ముహూర్తం ప్రకారం ఉదయం 10 గంటలకే పార్టీ ప్రకటన, జండా ఆవిష్కరణ పూర్తి చేశారు. కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఈ సభ జరిగినప్పటికీ.. పరిసర ప్రాంతాలన్నీ జనసందోహంతో కిక్కిరిసిపోయాయి. ప్రధానంగా సిరిసిల్లతో పాటు గజ్వేల్, సిద్దిపేట నుంచి ఎక్కువగా కవిత మద్దతు దారులు తరలిరావడం విశేషం.

**చతుర్ముఖ పోటీ తప్పదు..**

తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ ఆవిర్భావంతో తెలంగాణలో చతుర్ముఖ పోటీ తప్పేలా లేదు. ఇప్పటికే అధికార కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ, భారత రాష్ట్ర సమితులు ఉన్నాయి. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర సేన మరో ప్రధాన రాజకీయపక్షంగా అవతరించనుంది. అయితే కవిత ప్రకటనను తేలిగ్గా తీసుకుంది భారత రాష్ట్ర సమితి. టిఆర్ఎస్ పేరు ఫ్రీ అయిందని.. దానిని ఇప్పుడు ఎవరైనా వాడుకోవచ్చని గతంలో కవిత ప్రకటించారు. వెంటనే



అప్రమత్తమయ్యారు కేటీఆర్. భారత రాష్ట్ర సమితిని టిఆర్ఎస్ గా మార్పు ప్రతిపాదన ఉందని చెప్పుకొచ్చారు. దీంతో జగిత్యాల సభలో టిఆర్ఎస్ పునరుద్ధరణ ప్రకటన వస్తుందని అంతా భావించారు. కానీ అటువంటి ప్రకటన ఏమి రాలేదు. ఇప్పుడు కవిత ప్రకటనతో ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు గులాబీ పార్టీ నేతలు. కవితను చాలా తేలిగ్గా తీసుకున్నారు. కానీ ఆమెతో పనిచేసి చూపించారు. తెలంగాణ రాష్ట్ర సేనలను ప్రకటించి టిఆర్ఎస్ ను సొంతం చేసుకున్నారు.. అయితే ఇది గులాబీ పార్టీపై పై చేయి సాధించినట్టేనని తెలంగాణ పొలిటికల్ పండితులు చెబుతున్నారు.

# తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్ స్కైరూట్ ఏరోస్పేస్ వేదికగా దేశపు తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1 ప్రయాణం మొదలు కానుంది. ఇందులో భాగంగా మ్యాక్స్-క్యూ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, పలువురు అధికారులు హాజరయ్యారు. శ్రీహరి కోటకు పంపనున్న రాకెట్ విక్రమ్-1ను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. ప్రీ ఫైలట్ పరీక్షలన్నింటినీ పూర్తి చేసుకొని తదుపరి ప్రయోగం కోసం.. సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌కు ఇది చేరుకోనుంది. ఇండియాలోనే తొలి ప్రైవేట్ రాకెట్ గా రికార్డుకెక్కిన విక్రమ 1 రాకెట్ ను ఫ్లాగ్ ఆఫ్ చేసి శ్రీహరి కోటకు పంపారు సీఎం రేవంత్ రెడ్డి. 2026 ఏప్రిల్ 25న శంషాబాద్ ఏరోస్పేస్ పార్క్‌లోని స్కైరూట్ సంస్థను సందర్శించారు సీఎం. ఆ సంస్థ తయారు చేసిన భారత తొలి ప్రైవేట్ కమర్షియల్ రాకెట్ విక్రమ్-1 గురించి తెలుసుకున్నారు. స్కైరూట్ సంస్థలో రాకెట్ తయారీ, టెక్నాలజీ తదితర అంశాల గురించి చర్చించారు. తొలి ప్రైవేట్ రాకెట్ తయారు చేసిన సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. రాకెట్ ను శ్రీహరికోట లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి లాంచ్ చేయనున్నారు. దీంతో సీఎం రేవంత్ జెండా ఊపి శ్రీహరి కోటకు పంపారు. హైదరాబాద్‌కు చెందిన స్పేస్‌టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్-1 భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ కమర్షియల్ ఆర్బిటల్ రాకెట్. 2025 నవంబర్‌లో ఈ రాకెట్ ను ఆవిష్కరించారు.

# మహిళ విద్యా,ఉపాధిపై ప్రభుత్వం దృష్టి

హైదరాబాద్,ఏప్రిల్25(ఆర్ఎన్ఎ): మహిళల విద్య, ఉపాధిపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. మహిళల ఆర్థికాభివృద్ధికి క్రమశిక్షణ, లాభదాయక వ్యాపారాలపై దృష్టి పెట్టాలని సూచించారు. టీనేజ్ బాలికల కోసం స్నేహ సమ్మర్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. లైఫ్ స్కిల్స్, భద్రత, సైకిల్ ట్రైనింగ్ కార్యక్రమాలు చేపడుతామని.. ఈ కార్యక్రమాలను బాలికలంతా సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క దిశానిర్దేశర చేశారు. త్వరలో మహిళా సంఘ సభ్యుల ఎడ్యుకేషన్ ప్రొఫైల్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మహిళల విద్యార్హతలను గుర్తించి ఉన్నత విద్య అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. శనివారం బీఆర్‌కే భవన్‌లో సెర్ప్ డైరెక్టర్లు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులతో మంత్రి సీతక్క సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళా సంఘ భవనాల నిర్మాణం, 'అమ్మకు అక్షరమాల', సెర్ప్ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. ప్రతి మహిళా అక్షరాస్యురాలిగా ఉండటమే తమ ప్రభుత్వ లక్షమని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. 5,239 గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణ పనులు ఊపందుకున్నాయని వెల్లడించారు. ఇప్పటికే కొన్ని వీఓ భవనాలు పూర్తి అయ్యాయని తెలిపారు. ఈ పనులను వేగవంతం చేస్తున్న అధికారులకు అభినందనలు తెలిపారు. వచ్చే ఏడాది మరో 5,000 వీఓ భవనాలను నిర్మిస్తామని చెప్పుకొచ్చారు. 'అమ్మకు అక్షరమాల' ద్వారా ఇప్పటివరకు 6.5 లక్షల మహిళలకు అక్షరజ్ఞానం కల్పించామని వెల్లడించారు. త్వరలో మరో 6.5 లక్షల మహిళలకు గ్రామాల్లోనే విద్యాబోధన కల్పిస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళా సంఘాలు.. బాల్య వివాహాల వంటి సామాజిక రుగ్మతల నిరోధంలో ముందుండాలని పిలుపునిచ్చారు.

## మే 5నుంచి బెంగాల్లో మహిళలకు స్వేచ్ఛ

కోల్‌కతా,ఏప్రిల్25(ఆర్ఎన్ఎ):ప్రస్తుతం బెంగాలీ మహిళలు భయంతో జీవిస్తున్నారని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. మహిళలు సాయంత్రం ఏడు తర్వాత బయటికి రావొద్దంటూ మమతా బెనర్జీ గతంలో చేసిన వ్యాఖ్యలను అమిత్ షా విమర్శించారు. మే ఐదో తేదీ తర్వాతి నుంచి పశ్చిమ బెంగాల్ మహిళలు రాత్రి ఒంటిగంట తర్వాత కూడా భయం లేకుండా రోడ్లపై తిరగొచ్చని అమిత్ షా పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పూర్బ బర్ధమాన్ జిల్లాలోని జమాల్‌పూర్ గ్రామంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా పాల్గొన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రత విషయంలో విఫలమయ్యారని ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై విమర్శలు గుప్పించారు. 'ఒక మహిళా ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైన పాలనకు సంకేతమా?' అని ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లోనూ మహిళలు ధైర్యంగా ఉన్నారని, మే 5 తర్వాత బెంగాలీ మహిళల పరిస్థితి కూడా మెరుగుపడుతుందని అన్నారు. తల్లులు, సోదరీమణుల వైపు దురుద్దేశంతో చూసేందుకు ఏ దుండగుడు సాహసించినా, వారిని జైలులో పెడతామని భారతీయ జనతా పార్టీ హామీ ఇస్తుందన్నారు. గత పదిహేను సంవత్సరాల మమతా బెనర్జీ పాలనలో, అత్యధికంగా నష్టపోయిన వారు మన తల్లులు, సోదరీమణులే. బెంగాల్‌లో మహిళలపై ఎన్నో హింసాత్మక ఘటనల జరిగాయి. మహిళలు రాత్రి 7 గంటల తర్వాత ఇళ్ల నుంచి బయటకు రాకూడదని దీదీ అంటున్నారు.

### తెలంగాణలో నేటి నుంచి
## సెల్ఫ్-ఎన్యుమరేషన్

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** జనగణన-2027లో భాగంగా తెలంగాణలో ఈ నెల 26 నుంచి సెల్ఫ్-ఎన్యుమరేషన్ కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతీ హొళికెరి తెలిపారు. సెల్ఫ్-ఎన్యుమరేషన్ పక్రియ ఏప్రిల్ 26 నుంచి మే 10వ తేదీ వరకు కొనసాగుతుందని వివరించారు. శనివారం హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి జనగణన ఇది అని పేర్కొన్నారు. డిజిటల్ పద్ధతిలో జరుగుతున్న తొలి జనగణన కూడా ఇదేనని తెలిపారు. జనాభా లెక్కల సేకరణ వివరాలను ఆమె మీడియాకు వివరించారు. స్వాతంత్ర్యం తర్వాత తొలిసారి కులగణన జరుగుతుండటం కూడా ఈసారి జనగణనలో ప్రత్యేకమని వివరించారు. ముఖ్యంగా మొదటిసారిగా జనగణన పక్రియలో ఈసారి సెల్ఫ్-ఎన్యుమరేషన్ పక్రియ పాటిస్తున్నామని.. ప్రజలు నేరుగా జనగణనలో పాల్గొనేందుకు ఇది ఒక మంచి అవకాశమని ఆమె చెప్పారు. వెబ్ పోర్టల్ ద్వారా స్వచ్ఛందంగా జనగణనకు తమ వివరాలను అందించవచ్చని తెలిపారు. సెల్ఫ్-ఎన్యుమరేషన్ అనేది తప్పనిసరి కాదని.. కేవలం ప్రజలకు ఒక సౌలభ్యం మాత్రమేనన్నారు. తెలంగాణ భౌగోళిక పరిధిలో ఉన్న ప్రతి ఇంటినీ లెక్కిస్తామని భారతీ హొళికెరి అన్నారు. ఆస్పత్రి, బడి, గుడి, గుడిసె, అద్దెభవనం ఇలా ఏదైనా జనగణన జరుగుతుందన్నారు. ' భవనంలో ఉన్న ప్రతి కుటుంబాన్ని పరిగణనలోకి తీసుకుంటాం. 2027 ఫిబ్రవరిలో రెండో దశ మొదలయ్యేలోగా అంతా సిద్ధం చేస్తాం. రెండో దశలో 2027 ఫిబ్రవరి నుంచి వ్యక్తిగత సమాచారం సేకరిస్తాం. ఇళ్ల గణన కోసం బ్లాకులుగా విభజించి ఎన్యుమరేటర్లను కేటాయిస్తాం. మే 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి మార్కు చేస్తారు. ప్రతి భవనంలో ఎన్ని ఇళ్లు ఉన్నాయనేది మార్కు చేస్తారని ఆమె పేర్కొన్నారు.

# రేవంత్ ఉడుం పట్టు!

(మొదటి పేజీ తరువాయి)

మంత్రివర్గంలోకి తీసుకున్నారు అప్పుడే అజారుద్దీన్ పేరును గవర్నర్ కోటా ఎమ్మెల్సీల జాబితాలో చేర్చారు. ప్రొఫెసర్ కోదండరామ్ తో కలిసి మహమ్మద్ అజారుద్దీన్ పేరును సూచిస్తూ గవర్నర్ వద్దకు ఫైల్ పంపించారు. ఇంతలోనే తెలంగాణ గవర్నర్ మార్పు కారణంగా ఫైల్ ఆలస్యం అయింది. ఆపై కొత్త గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఈ ఫైల్ ను పక్కన పెట్టినట్లు ప్రచారం నడిచింది. ఈ నెల 30తో అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ఆరు నెలలు అవుతోంది. ఈ తరుణంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా మరికొద్ది రోజులు నిర్ణయం తీసుకునేందుకు ఆలస్యం చేసి ఉంటే అజారుద్దీన్ పదవిపోవడం ఖాయం. అయితే ఆ గండం నుంచి తన మంత్రిని గట్టెక్కిస్తూ రేవంత్ రెడ్డి వ్యూహాత్మక విజయం సాధించారు.

**ఇటీవల పరిణామాలతో..**

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోయిన సంగతి తెలిసిందే. దక్షిణాది రాష్ట్రాల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. అయితే ముందుగా ఉద్యమించింది తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. ఇటువంటి పరిస్థితుల్లో తెలంగాణ సీఎం పై కేంద్ర ప్రభుత్వం ఆగ్రహంగా ఉందన్న ప్రచారం సాగింది. కచ్చితంగా సీఎం రేవంత్ రెడ్డికి రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిపెట్టే ఎమ్మెల్సీ ఫైల్ పై గవర్నర్ శివప్రతాప్ శుక్లా సంతకం చేయాలని ప్రచారం నడిచింది. కానీ వాటన్నింటినీ తెర దించుతూ సీఎం రేవంత్ రెడ్డి మంత్రాంగం పనిచేసింది. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించిన ఫైల్ పై సంతకం చేశారు. ఈ విషయంలో మాత్రం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చతురత స్పష్టమవుతుంది. ఆయన రాజకీయ వ్యూహంతో పాటు ఢిల్లీ సర్కిల్స్ పలుకుబడి అమాంతం పెరిగినట్లు అర్థమవుతోంది. ఒకవైపు న్యాయస్థానాల్లో వాదనలు వినిపిస్తూనే.. మరోవైపు రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న గవర్నర్ను ఒప్పించడంలో రేవంత్ రెడ్డి మార్కు రాజకీయం ఫలించింది.

**లింఉద్యమ సిద్ధాంతకర్తకు..**

తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి వరించింది. తద్వారా ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవించింది అనే సంకేతాలు వెళ్లాయి. వాస్తవానికి గతంలోనే ఆయన ఎమ్మెల్సీ అయ్యారు. కానీ చట్టపరమైన సమస్యలతో మాజీ అయ్యారు. కానీ ఇప్పుడు మళ్లీ అవకాశం దక్కించుకున్నారు. అయితే ఈ ఇద్దరి పేర్లను ఆమోదిస్తూ గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రభుత్వం నైతిక విజయం సాధించినట్లు అయింది. ఈ ఎమ్మెల్సీల నియామకాల ఆమోదం రేవంత్ రెడ్డి రాజకీయ పట్టును మరింత బలపరిచింది.

## అబద్దాల ప్రచారంలో సజ్జల దిట్ట

అమరావతి:అబద్దాలు ప్రచారం చేయడంలో వైసిఇ నేత సజ్జలకు ఉన్న ప్రావీణ్యం దేశంలో ఎవరికీ లేదని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా అచ్చెన్నాయుడు ట్వీట్ పెట్టారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో అప్పుల భారంతో రైతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని ధ్వజమెత్తారు. నేడు కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగలా మారుస్తోందని వ్యాఖ్యానించారు. తమ గణాంకాలు ప్రస్తావించామని.. దమ్ముంటే సమాధానం చెప్పాలని సజ్జలకు సవాల్ చేశారు. వైసీపీ వైఫల్యం వల్ల 2023-24లో 143 లక్షల మెట్రిక్ టన్నులకు ఆహార ధాన్యాల ఉత్పత్తి పడిపోయిందని అచ్చెన్నాయుడు తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 237 లక్షల టన్నులకు పెంచి 51శాతం వృద్ధిని నమోదు చేసిందని ప్రస్తావించారు. ధరల స్థిరీకరణ నిధి కింద కేటాయింపులు పెంచి, సుమారు రూ.588 కోట్లతో పొగాకు, మామిడి, ఉల్లి, కోకో రైతులకు నేరుగా లబ్ది చేకూర్చామని వివరించారు. ఉల్లి రైతులకు గతంలో ఉన్న రూ.25 వేల నష్టపరిహారాన్ని హెక్టారుకు రూ.50 వేలకు పెంచి ఆదుకున్న ఘనత తమ కూటమి ప్రభుత్వానిదేనని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం మొక్కజొన్న సమస్యపై కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో నిరంతరం చర్చిస్తూ రైతులకు అనుకూల నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నామని అచ్చెన్నాయుడు వెల్లడించారు. మైక్రో ఇరిగేషన్‌లో ఏపీని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టామని చెప్పారు.

# కూకట్ పల్లి ఎమ్మెల్యే పై నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ సవాల్

**10 సంవత్సరాల హాయంలో కూకట్ పల్లి కి నువ్వు చేసింది శూన్యం**

**కూకట్ పల్లి లో 90% అభివృద్ధి అని చెప్పిన నీవు చేసిన చెప్పుకోదగ్గ ఒక్క ప్రాజెక్టు కూకట్ పల్లి లో చూపించు...**

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పై ధ్వజమెత్తిన టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్**




**కూకట్ పల్లి, ఏప్రిల్ 25 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పై కాంగ్రెస్ పార్టీ టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి నియోజకవర్గ ఇన్చార్జి బండి రమేష్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కూకట్ పల్లి కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రధానంగా ఇటీవల ప్రజా పాలన ప్రగతి నివేదిక విషయంలో రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించడం విమర్శించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కూకట్ పల్లి లోని చిరు వ్యాపారులపై కపట ప్రేమ చూపిస్తున్న నువ్వు మీ హయాంలో చిరు వ్యాపారాలను ఎందుకు పట్టించుకోలేదని, ఐడియల్ లేకు వద్ద ఉన్న 40 మంది చిరు వ్యాపారాలని మీ హాయంలో ఎందుకు లేపేసారని ప్రశ్నించారు. మీ హయాంలో వారికి పది ఎకరాలు ఇప్పించి మార్గం చూపించకపోయినా నువ్వు మాట్లాడే అర్హత లేదని అన్నారు. కూకట్ పల్లి లో ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ చాలా స్ట్రాంగ్ గా ఉందని, దాదాపు నియోజకవర్గ స్థాయిలో 11 నుంచి 120 మందికి పదవులు ఇప్పించామని, టెంపుల్ కమిటీలు వేసుకొని కాంగ్రెస్ పార్టీ ముందుకెళ్తోంది అని తెలిపారు. కూకట్ పల్లి అభివృద్ధికి అన్ని రకాల సహకరిస్తూ, కూకట్ పల్లి డిగ్రీ కాలేజీకి దాదాపు రెండున్నర కోట్ల కలెక్టర్ ఫండు ఇతర ఫండ్ తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నామని ఇంటర్ నుండి పిజి కాలేజ్ వరకు అభివృద్ధి చేయడానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. అలాగే మీ హయాంలో శిలాఫలకం వేసిన 100 పడకల ఆసుపత్రి పని జరుగుతుందని త్వరలోనే అది పూర్తి చేస్తామని తెలిపారు. క్రీడల కోసం పార్కులు ఏర్పాటు చేస్తున్నామని మీలాగా కల్లబొల్లి కబుర్లు చెప్పి మేము పక్కకు పోవట్లేదు అని తెలిపారు. మీ హయాంలో ఒక్క గుడికి ఒక్కొక్క ఓనర్ మాజీ కార్పొరేటర్ మూడు గుడులకు ఇంచార్జ్, కూరగాయల మార్కెట్ కోసం ఏర్పాటుచేసిన భవనాల్లో ఎస్పీ నగర్ కావచ్చు, సిక్స్త్ ఫేస్, నైన్త్ పేస్ లలో ఏర్పాటు చేసిన మార్కెట్లలో మీ అనుచరులతో కబ్జా చేయించింది నిజం కాదా, మీ హయాంలో ఐడిఎల్ ల్యాండ్ అన్యాక్రాంతమైందని హానర్ హోమ్స్ లో మీకు ఇల్లు ఎలా వచ్చాయని ఆయన ఎమ్మెల్యే ని ప్రశ్నించారు. పొద్దున లేస్తే సీఎం మీద విమర్శలు చేస్తా నీకు ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి లేదని ఎద్దేవా చేశారు. హైడ్రా అభివృద్ధి చేసిన నల్లచెరువు పై రెండున్నలకల ధోరణి కరెక్ట్ కాదని స్టేజ్ పైన ఒక మాట స్టేజి దిగాక ఒక మాట మాట్లాడటం నీ విజ్ఞతకే వదిలేస్తున్నానని తెలిపారు. మూసాపేట జంక్షన్ లో 170 కోట్లతో ఫ్లైఓవర్ నేర్పిస్తున్నామని అలాగే జేఎన్టీయూ స్కైవాక్ కూడా పని జరుగుతుందని తమ ప్రభుత్వంలో అభివృద్ధి దూసుకుపోతుందని ఆయన తెలిపారు. ఎంతసేపటికి అధికారులను భయపడటం బెదిరించి వారితో పని చేయించుకోవడం కరెక్ట్ కాదని తెలిపారు. 90 శాతం అభివృద్ధి చేస్తే ఎక్కడా ఏమీ కనిపించట్లేదని ఆయన ఎద్దేవా చేశారు. బాలానగర్ ఫ్లైఓవర్ నిర్మాణం లో సైతం ని ప్రమేయం ఏమీ లేదని అప్పటికి ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణ, సర్వే సత్యనారాయణ కృషి వల్ల వచ్చిందని ఆయన అన్నారు. కెపిహెచ్బి ఫ్లైఓవర్ కట్టినప్పుడు నువ్వు ఏ పార్టీలో ఉన్నావో గుర్తు చేసుకోవాలని తెలిపారు. ఎన్టీఆర్ స్కూల్ పేరుతో పండు వసూలు చేసి ఎక్కడ ముందుకు జగన్ పరిస్థితి నీ హాయంలో జరగలేదా అని ప్రశ్నించారు. ఎంతసేపు ప్రభుత్వం ప్రభుత్వ అధికారుల మీద పడి ఏడవటం తప్పితే నువ్వు చేసేది ఏమీ లేదని అన్నారు. గత హయాంలో కెపిహెచ్బిలో చాపల మార్కెట్ ఏర్పాటు చేస్తే ఆ దుకాణాలు ముదిరాజు సోదరులకు కాకుండా మీ అనుచరులకి ఇప్పించి అద్దెలు వసూలు చేసేది నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. రైతు బజార్లో దుకాణాలు ఏఎంసి లో ఎలా చేసిన దుకాణాలు ఎవరి పేరు మీద ఉన్నాయో బయటకు తీస్తామని అని తెలిపారు. కూకట్ పల్లి లో అక్రమ నిర్మాణాలకి ఆద్యుడివి నీవు కావా ఇప్పుడు నీ ఆత్మ కడుతున్న కెపిహెచ్బి భువనవిజయం బిల్డింగ్ ని కూల్చేదామా అంటూ ఆయనకు సవాల్ విసిరారు. చిరు వ్యాపారులపై కపట ప్రేమ చూపిస్తున్న నువ్వు గతంలో వారికి చేసింది శూన్యం అని కేవలం నీ అనుచరుల మనుగడ కోసమే నువ్వు మాట్లాడుతున్నామని ఆయనపై విరుచుకుపడ్డారు. మా కాంగ్రెస్ కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. మూడు కార్పొరేషన్లతో ప్రజలకు చేరువై వారికి సేవ చేయాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళుతుందని తెలిపారు. అంతెందుకు గోపాల్ నగర్ లో కనీసం పార్కు లేదని నువ్వు 10 సంవత్సరాల్లో పార్క్ ఎందుకు ఇప్పించలేకపోయావని ప్రశ్నించారు. తమ హయాంలో హైడ్రా ద్వారా 3,300 గజాల స్థలంలో పార్క్ ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. మీ ఇంటికి కూతవేటు దూరంలో ఉన్న స్వాన్ లేక్ పక్కన నాలాతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ పది సంవత్సరాల్లో ఏమీ ఎందుకు చేయలేకపోయావని బండి రమేష్ ప్రశ్నించారు.




## మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణం

**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు మండల పరిధిలోని ఉకోండి గ్రామంలో మద్విరాజ్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి 20 వ కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు..సర్పంచ్ పోలగోనీ విజయలక్ష్మి సైదులు గౌడ్ ల ఆధ్వర్యములో అన్నదానం నిర్వహించారు..గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కూరెళ్ళ ఆంజనేయులు,మునగాల యాదగిరి గ్రామస్థులు పాల్గొన్నారు.

## చందిప్ప మరకత శివాలయం ఖాతాలపై చర్యలు తీసుకోవాలి ఆర్. నరేష్ కుమార్ డిమాండ్



**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** చందిప్ప మరకత శివాలయం ఆలయ కమిటీకి తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఇచ్చిన 15 రోజుల గడువు దాటిన నేపథ్యంలో, నిబంధనల ప్రకారం ఆలయ ఖాతాలను స్వాధీనపరుచుకుని రికవరీ చర్యలు చేపట్టాలని మరకత శివలింగ నామకరణ భక్తుడు, ఆలయ పునర్నిర్మాణ శ్రీకారకుడు, శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్. నరేష్ కుమార్ డిమాండ్ చేశారు.శనివారం ఆయన దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేస్తూ, ఆలయంలో జరిగిన ఆర్థిక లావాదేవీల్లో అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. 2007లో ఆలయం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటి వరకు వచ్చిన ఆదాయం, హుండీ లెక్కలు, బ్యాంక్ ఖాతాలు, టికెట్ ఆదాయం వంటి అన్ని వివరాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి నెల పర్వదినాలలో వేలాదిగా వచ్చే భక్తుల నుండి వచ్చిన ఆదాయం, వాహనాల పార్కింగ్, కొబ్బరికాయలు, అభిషేకాలు, గోవు దానం వంటి టికెట్ల ద్వారా వచ్చిన మొత్తాలపై స్పష్టమైన లెక్కలు ఉన్నాయా అనే విషయంపై అనుమానాలు వ్యక్తం చేశారు. అలాగే ఆలయ సీసీటీవీ ఫుటేజ్ వివరాలు కూడా పరిశీలించాలని కోరారు.మార్చి 30న ఎండోన్మెంట్ అధికారులు ఇచ్చిన నోటీసులకు అనుగుణంగా ఏప్రిల్ 15లోపు ఖాతాలు సమర్పించాల్సి ఉండగా, కమిటీ సభ్యులు మూడు నెలల గడువు కోరడం అనుమానాలకు తావిస్తోందన్నారు. నిజాయితీగా ఉంటే తక్షణమే లెక్కలు చూపాల్సిందని అన్నారు.అలాగే గతంలో హుండీ దొంగతనం ఘటనపై తాను పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆలయ నిర్మాణంలో తనతో పాటు ఇతర దాతలు సహకరించారని, కానీ ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై సందేహాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఆలయానికి సంబంధించిన అన్ని లెక్కలు గ్రామ సభలో ప్రజల సమక్షంలో వెల్లడించాలని, సంబంధిత అధికారాలు పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందూ ధర్మాన్ని కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు.

## మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్‌కు పదోన్నతి బదిలీ



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, ఏప్రిల్ 25: మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌గా సేవలందిస్తున్న ఎం. నారాయణ్ అమిత్‌కు పదోన్నతి బదిలీ లభించింది. రాష్ట్రంలో ఆరుగురు ఐఎఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు జిఒ ఆర్టీ నంబర్ 542ను శుక్రవారం జారీ చేశారు.ఈ ఉత్తర్వుల ప్రకారం అమిత్‌ను హైదరాబాద్‌లోని గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా నియమించారు.మిర్యాలగూడలో తన పదవీకాలంలో అమిత్ పలు అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసి మంచి గుర్తింపు పొందారు. ప్రజలకు చేరువగా ఉండి పరిపాలనలో ప్రత్యేక ముద్ర వేశారు. ఆయనకు లభించిన ఈ బాధ్యతపై స్థానిక ప్రజలు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## మీడియా వ్యవస్థ పై ప్రజల్లో నమ్మకం పెంచాలి

**మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**

**కూకట్ పల్లి, ఏప్రిల్ 25 (క్రైమ్ మిర్రర్):** మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించి మీడియా వ్యవస్థ పై ప్రజల నమ్మకాన్ని పెంపొందించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డి విజయేందర్ రెడ్డి ఆకాంక్షించారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ మందిరం లో నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన డిస్ట్రిక్ట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులకు జిల్లా అదనపు కలెక్టర్ డి విజయేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, 252 జి ఓను అనుసరించి నిబంధనలు పాటించాలని అన్నారు. అక్రిడిటేషన్ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా చూడాలని నియమ నిబంధనలు పాటించాలని, ఎప్పటికప్పుడు కమిటీ సభ్యులతో అన్ని విషయాలు చర్చించి ముందుకు వెళ్లాలని సూచించారు. మీడియా ప్రతినిధులు ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సరిగ్గా చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. ఎవరైనా అక్రిడిటేషన్ కోసం నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.అంతకుముందు కమిటీ సభ్యులు అక్రిడిటేషన్ ప్రక్రియ గురించి తమ అనుభవాలను పంచుకొని, ఈ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా సాగే విధంగా పలు సూచనలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు జిల్లా అదనపు కలెక్టర్ ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు మోతె వెంకట్ రెడ్డి, గడ్డమీది బాలరాజు, రవిచందర్, రామారావు, ప్రసాద్, భూపాల్,అబ్దుల్ సామీ, మహామూద్, డిపిఆర్వో స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సేన పార్టీలో బతుకమ్మ పార్టీ విలీనం

**కల్వకుంట్ల కవిత సమక్షంలో పార్టీని విలీనం చేసిన బతుకమ్మ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మణిపాల్ రెడ్డి**

**భవిష్యత్తులో కల్వకుంట్ల కవితను సీఎం చేయడమే లక్ష్యం మణిపాల్ రెడ్డి**




**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 25:** రాష్ట్రంలో సంచనాల దిశగా ఏర్పడిన కొత్త పార్టీ తెలంగాణ రాష్ట్ర సేనలో బతుకమ్మ పార్టీని విలీనం చేస్తున్నట్టు బతుకమ్మ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మణిపాల్ రెడ్డి తెలిపారు. రెండు సార్లు ఆలేరు కాంటెస్ట్ ఎమ్మెల్యేగా ఒకసారి భువనగిరి కాంటెస్ట్ ఎంపీగా పోటీ చేసి ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని బతుకమ్మ పార్టీనీ నిర్మించారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో అన్నీ వర్గాలను కలుపుకొని తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను సీఎం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరం కష్టపడుదామని ఆయన తెలిపారు. గతంలో ఎన్ని ఆటంకాలు వచ్చినా తమ లక్ష్యాన్ని టార్గెట్ గా చేసుకొని ప్రతి ఒక్కరిని కలుపుకొని తెలంగాణ జాగృతి పేరుతో వాడ వాడ బతుకమ్మ పండుగను గుర్తుచేస్తూ వాడల నుంచి దేశం గర్వించేలా బతుకమ్మ పండుగను దేశవ్యాప్తంగా మరియు ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేసిన కల్వకుంట్ల కవిత నాయకత్వంలో అందరం పనిచేస్తూ భవిష్యత్తులో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేసిన కడిగిన ఆణిముత్యం లాగా కవితక్క పార్టీని బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. సుమారు 1000 మందితో ఆలేరు నుండి తన కార్యాలయం వద్ద సుమారు 20 బస్సులలో వెయ్యి మందిని తమ సొంత పార్టీ కార్యకర్తలను కవితమ్మ ఏర్పాటు చేసే పార్టీ సభ వేదికకు తరలించామని ఆయన తెలిపారు.

## హైకోర్టు సిజెగా జస్టిస్ లీసా గిల్

అమరావతి: ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్.. ఆమెతో ప్రమాణం చేయించారు. జస్టిస్ లీసా గిల్ స్వస్థలం చండీగఢ్. అక్కడ కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో పాఠశాల విద్య, ప్రభుత్వ మహిళా కాలేజీలో హ్యూమానిటీస్‌లో డిగ్రీ చదివారు. పంజాబ్ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తిచేశారు. 1990లో న్యాయవాదిగా పేరు నమోదుచేసుకొని పంజాబ్-హరియాణా హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. సివిల్, క్రిమినల్, రెవెన్యూ, రాజ్యాంగపరమైన కేసుల ద్వారా అన్ని రంగాల్లో అనుభవం గడించారు. సుదీర్ఘకాలం చండీగఢ్‌కు, పలు ప్రభుత్వరంగ బోర్డులకు, కార్పొరేషన్లకు ప్రాతినిధ్యం వహించారు. 2014 మార్చి 31న పంజాబ్-హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఇదిలావుంటే లీసాగిల్‌కు సిఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. తొలి మహిళా చీఫ్ జడ్జిగా ఏపికి రావడం గర్వకారణమని అన్నారు.

# సమ్మర్ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించిన ఎల్బీనగర్ ఎం.ఎల్.ఏ సుధీర్ రెడ్డి

**ఎల్బీనగర్ ఏప్రిల్ 25,క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వనస్థలిపురం చత్రపతి శివాజీ గ్రౌండ్‌లో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవి సెలవుల్లో పిల్లలు మరియు యువతకు క్రీడలు, ఫిట్‌నెస్, నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఇలాంటి శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ శిబిరాలు పిల్లలలో శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు.పిల్లలలో టాలెంట్ పెంపొందించడం, సెలవుల్లో ఖాళీగా ఉండకుండా సమయాన్ని ఉపయోగకరంగా వినియోగించడం, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేయడం, శారీరక దృఢత్వం పెరగడం, క్రమశిక్షణ మరియు టీమ్‌వర్క్ నేర్చుకోవడం వంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో స్పోర్ట్స్ కెరీర్‌కు కూడా ఇవి దోహదపడతాయని తెలిపారు.గతంలో తాను హుడా చైర్మన్‌గా ఉన్న సమయంలో ఈ స్థలాన్ని పార్క్‌గా కాకుండా ప్లేగ్రౌండ్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకున్నానని గుర్తు చేశారు. ప్రస్తుతం గాయత్రి భవన్,డి.పి.ఎస్ గ్రౌండ్, వనస్థలిపురం ఫేజ్-4, శివాజీ గ్రౌండ్స్ వంటి ఐదు ప్లేగ్రౌండ్స్ అభివృద్ధి చేయడం జరిగిందన్నారు.వనస్థలిపురం,బి.ఎన్.రెడ్డి నగర్




ప్రాంతాల్లో ఉన్న పార్కులు మరియు ప్లేగ్రౌండ్స్ ఇతర ప్రాంతాల్లో లేవని, యువత కోసం దూరదృష్టితో వీటిని అభివృద్ధి చేశామని తెలిపారు. ఇప్పుడు అదే ప్రదేశాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహించడం ఆనందదాయకమని చెప్పారు. గత జీహెచ్ఎంసీ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో 13 స్విమ్మింగ్ పూల్స్ ఉండగా, ఎల్బీనగర్ నియోజకవర్గంలోనే మూడు స్విమ్మింగ్ పూల్స్ ఉండడం గర్వకారణమని పేర్కొన్నారు. 8 సంవత్సరాల వయస్సు నుంచి 80 సంవత్సరాల వయస్సు వరకు ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేలా పార్కులు, ప్లేగ్రౌండ్స్ ఏర్పాటు చేశామని తెలిపారు.నేటి యువతకు ఆడుకునే ప్రదేశాలు లేకపోవడంతో ప్లేగ్రౌండ్స్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.అనంతరం గతంలో పలు పోటిల్లో పాల్గొన్న పలువురు విద్యార్థినీ ,విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ రెడ్డి,అధికారులు అశోక్, నాగేందర్, వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి,డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్త,బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి,ఇతర నాయకులు,కోచ్‌లు,విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సిపిఐ తన విశ్వసనీయతను కోల్పోతున్నది: సర్పంచ్ పృథ్వి



**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని గోపరాజు పల్లి గ్రామంలో మార్కెట్ ఇన్చార్జిల మధ్య ఘర్షణలు తలెత్తి కొనుగోలు ప్రక్రియలో అలసత్వం వహిస్తున్నారనడం పచ్చి అబద్ధం ఇది సిపిఐ యొక్క విశ్వసనీయతకు దిగజారుడు తనానికి నిదర్శనం అని గ్రామ సర్పంచ్ సలిగంజి పృథ్వి అన్నారు. గ్రామంలో సిపిఐ పార్టీ నాయకులు స్థానిక ఎమ్మెల్యే పై తప్పుడు ఆరోపణ చేయడం సరియైన విధానం కాదని ఇలాంటి ఆరోపణలు మరోసారి చేస్తే ఉపేక్షించేది లేదని ఆయనధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొంటామని వడ్ల కొనుగోలు ప్రక్రియ రేపటి నుండి ప్రారంభమవుతుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

## డిజిటల్ ఇండియాలో భాగంగా జనగణనలో ప్రజలు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

**గండిపేట(క్రైం మిర్రర్):** భారత జనగణన(సెన్సస్)--2026 స్వయం గణన(సెల్ఫ్ ఎన్యూమరేషన్) ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించారు. భారత ప్రభుత్వం హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జనగణన--2026 ప్రక్రియలో భాగంగా పౌరులందరికి తమ వివరాలను తామే నమోదు చేసుకునే స్వయం గణణ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. డిజిటల్ ఇండియాలో భాగంలో ప్రవేశపెట్టిన ఈ విధానం ద్వారా, ప్రజలు తమ ఇంటి వద్ద నుంచే సులభంగా సురక్షితంగా వివరాలను నమోదు చేయవచ్చునన్నారు. అధికారిక వెబ్‌సైట్‌లో వివరాల నమోదు కోసం పోర్టర్‌ను సందర్శించాలన్నారు. మీ మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి అడిగిన వివరాలను పూర్తి చేసి సబ్మిట్ చేసుకోవాలన్నారు. గణన సిబ్బంది మీ ఇంటికి వచ్చినప్పుడు మీరు ఇప్పటికే ఆన్‌లైన్‌లో పొందిన రిఫరెన్స్ నెంబర్‌ను వారికి చూపిస్తే సరిపోతుందన్నారు. దీని వల్ల మీ సమయం ఆదా అవుతుందన్నారు. జనగణన అనేది దేశ భవిష్యత్తు ప్రణాళికలు, అభివృద్ధి పథకాల రూపకల్పనకు అత్యంత కీలకమన్నారు. పౌరులందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వెబ్‌సైట్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోని ఈ జాతీయ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.

## పుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేయవద్దు

### రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డి




**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రజల ఉపయోగం కోసం నిర్మించిన పుట్‌పాత్‌లను కొందరు ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్నారని దీనిని ఏమాత్రం ఉపేక్షించమని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డి తెలిపారు. బండ్లగూడ జాగీరు జాతీయ రహదారి హైదరాబాద్--బీజాపూర్ రోడ్డులో పుట్‌పాత్ అక్రమణలను తొలగించారు. మధుపార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ నుంచి కాళీమందిర్ దేవాలయం వరకు ఉన్న పుట్‌పాత్ అక్రమణలను నెలమట్టం చేశారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రయాణిస్తున్న కారులో మంటలు

**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రయాణిస్తు కారులో ఒక్కసారిగ మంటలు చెలరేగిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం తెలంగాణ పోలీస్ అకాడామీ ప్రాంతంలో ఓ కారు లో నుంచి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. వెంటనే కారులోని వారు అప్రమత్తమై కారు నుంచి బయటకు దిగిపోయారు. క్షణాలలో మంటలు కారుకు మొత్తం వ్యాపించాయి. సమీపంలో పెట్రోల్ బంక్ ఉండడంతో ఎగసిపడుతున్న మంటలకు స్థానికులు భయభ్రాంతులకు గురైయ్యారు. పెట్రోల్ బంక్‌లో ఉన్న అగ్నిమాపక పరికరాలతో మంటలను అర్పే ప్రయత్నం చేశారు. రోడ్డుపై కారులో మంటలు చెలరేగడంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోని కారును పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



# పిసి ఘోష్ కమిషన్ నివేధిక కాదు... పీసీసీ నివేధిక

**కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ కురుమ, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గుమ్మడి కుమార్‌లు**

**గండిపేట(క్రైం మిర్రర్):** పిసి ఘోష్ కమిషన్ నివేధిక కాదు... పీసీసీ నివేధిక అని గతంలోనే చెప్పాం అని హైకోర్టు తీర్పుతో అది పూర్తిగా స్పష్టమైందని కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ కురుమ, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గుమ్మడి కుమార్‌లు అన్నారు. బాబుల్‌రెడ్డినగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ముఖ్యనాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైకోర్టు స్టేను స్వాగతిస్తున్నామన్నారు. మోసపూరితంగా తీసుకోచ్చిన పి.వి.ఘోష్ కమిషన్ నివేధను కొట్టివేయడంతో ఈ ప్రభుత్వం ధ్వంద వైఖరి బయటపడిందన్నారు. ఇది పిసి ఘోష్ కమిషన్ నివేధిక కాదు పీసీసీ నివేధిక అని గతంలో చెప్పాం అన్నారు. ఇవ్వాళ్ల హైకోర్టు తీర్పుతో అక్షర సత్యం అని తేలిపోయిందన్నారు. నీళ్లు నిండిపై నుంచి పోయినా నిల్చున్న మేడిగడ్డ బ్యారేజ్‌ను పట్టుకోని నానా మాటలు అన్నారన్నారు. 60 ఏళ్లుగా తెలంగాణకు నీళ్లు ఇవ్వకుండా దోచుకున్న జల ద్రోహులకు ఈ తీర్పు చెంపపెట్టు అన్నారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ నిందలు నీళ్లపాలు అయ్యాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందనడం అంతా కపట నాటకమన్నారు. ఇది రేవంత్‌రెడ్డి సర్కారే తేల్చిచెప్పిన సత్యం అన్నారు. ఒక వైపు ప్రాజెక్టు కాంపోనెంట్లన్నీ వినియోగం అవుతున్నా బరాజ్‌ల పునరుద్దరణకు దిగడమే నిదర్శనమన్నారు. హైకోర్టు తాజా తీర్పు అందుకు మరో



సాక్ష్యం అన్నారు. తరతరాల తెలంగాణ రైతుల కరువుకాటకాల తలరాత మార్చేందుకు, చెక్కుచెదరని జలసంకల్ప దీక్షతో పనులను ఉరకలెత్తించి, చరిత్ర ఎరుగని అసాధారణ కాల పరిమితిలో ఆగమేఘాల మీద ఒక ప్రాజెక్టు కడితే అందులో అవినీతి జరిగిందని నిందలు వేశారన్నారు. భారీ జలప్రవాహ వేగంలో ఒక బ్యారేజిలోని రెండు పిల్లర్లు కుంగిపోతే ప్రాజెక్టే కూలిపోయిందని గావుకేకలు పెట్టారన్నారు. 83వేల కోట్లు ఖర్చయిన ప్రాజెక్టును పట్టుకొని లక్షకోట్ల అవినీతి జరిగిందని కాకిగోల చేశారన్నారు. కండ్లముందు కాళేశ్వరం నీళ్లు పారుతుంటే గుండెలు జారి, నిద్రలు కరువై రాజకీయంగా పుట్టగతులుండవనే భయంతో కాంగ్రెస్, బీజేపీతో పాటు తెలిసినోడు, తెలువనోడు.. ఎవడి నోటికి వచ్చిన.. ఎవడి బుర్రకు తోచిన అడ్డగోలు ఆరోపణలన్నీ గుప్పించారన్నారు. ప్రాజెక్టే పనికిరాదు అన్న నోళ్లే ఇప్పుడు పునరుద్ధరణ మాటలు మాట్లాడడంతో ఆ ఆరోపణలు బూటకమని తేలిపోయిందన్నారు. ఇక తాజాగా హైకోర్టు తీర్పుతో లక్షకోట్ల అవినీతి అన్న ఆరోపణలు గాల్లో కలిసిపోయాయన్నారు. దీనికితోడు 'ఒక్క మేడిగడ్డ మాత్రమే కాదు మూడు బ్యారేజీలు పనికిరావు' అన్న నోళ్లే ఇప్పుడు తమ్మిడిహట్టి నీళ్లు సుందిళ్ల బ్యారేజ్‌లో పోస్తామంటూ చెప్పడంతో కాంగ్రెస్ నేతలు, వారి తోడు దొంగలు బీజేపీ నాయకులు చేసిన ప్రచారమంతా బూటకమని, దురుద్దేశపూర్వకమని తేలిపోయిందన్నారు. ఈ సమావేశంలో రాజేష్‌యాదవ్, గంజి రాజు నేత, మాచర్ల చిరంజీవి, ప్రవీణ్, అశోక్‌కుమార్ కురుమ, ఏర్వ మహేష్ నేత, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఇన్ఫినిటీ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా హిందూ సమ్మేళనం






గండిపేట(క్రైం మిర్రర్):హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను బావితరాలను నేర్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్వామి సర్వేశానంద, భారతీయం సత్యవాణిలు అన్నారు. ఇన్ఫినిటీ ఫంక్షన్‌హాల్‌లో శనివారం హిందూ మహా సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు, ప్రజాప్రతినిధులు, సామాజిక ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్వామి సర్వేశానంద, భారతీయం సత్యవాణిలు పాల్గొని హిందూ ధర్మం గొప్పతనం, సంస్కృతి పరిరక్షణ, సామాజిక ఐక్యత, ధార్మిక చైతన్యంపై ప్రసంగించారు. సనాతన ధర్మం సర్వజన హితం, శాంతి, సేవ, సమన్వయానికి ప్రతీక అని పేర్కొన్నారు. హిందూ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విశేష సహకారం అందించిన దాతలను కమిటీ ఘనంగా సత్కరించింది. ఇన్ఫినిటీ ఫంక్షన్ హాల్ అందించిన పిట్టల సత్యనారాయణ , ఉదారంగా విరాళం అందించిన ఐడియల్ బిల్డర్స్ సురేష్, అలాగే అన్నదానం నిర్వహించిన మెరుగు జితేందర్ లను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ హిందూ మహా సమ్మేళనం భక్తి, సంస్కృతి, సామాజిక బాధ్యత మరియు ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. యువతలో ధార్మిక చైతన్యం పెంపొందించడం, సమాజంలో సౌభ్రాతృత్వం బలోపేతం చేయడం, సేవా భావాన్ని ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలని నిర్వాహకులు తెలిపారు. హిందూ ఐక్యత-ధర్మ రక్షణ-సేవా భావం అనే సందేశాన్ని సమాజానికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణ కమిటీ అధ్యక్షులు రామ్‌రెడ్డి, కార్యదర్శి జితేందర్‌రావు దగ్గు, ఆర్గనైజింగ్‌కార్యదర్శులు శ్రీనివాస్ బాలగోని, శ్రీధర్‌దేవిసెట్టి, నాగరాజ్, సంజీవ్, జ్ఞానేశ్వర్, రంజిత్, వాణి తదితరులు పాల్గొన్నారు.



## టిఆర్ఎస్ ఆవిర్భావంతో బిఆర్ఎస్‌కు షాక్

### తమ బ్రాండ్ పోవడంతో నేతల్లో ఆందోళన

హైదరాబాద్: తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడు పోసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ఆవిష్కరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో సమావేశం నిర్వహంచారు. ఈ మీటింగ్‌లో కవిత తన కొత్త పార్టీ పేరు 'తెలంగాణ రాష్ట్ర సేనగా అంటే టిఆర్ఎస్‌గా ప్రకటించారు. పార్టీ పేరు బిఆర్ఎస్‌కు షాక్‌కు గురి చేసింది. శనివారం ఉదయం కవిత సర్వ మత ప్రార్థనలు చేశారు. బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి ర్యాలీగా బయల్దేరారు. గన్‌పార్కులో అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం నేరుగా సభా ప్రాంగణానికి చేరుకుని ఉదయం 10 గంటలకు పార్టీ పేరు ప్రకటించారు. అనంతరం.. పార్టీ జెండా విష్కరించారు. ఈ పార్టీ పేరు బీఆర్ఎస్‌ను బిగ్ షాక్‌కు గురి చేసింది. ఇదిలా ఉండగా.. పార్టీ ప్రకటించే సభా ప్రాంగణాన్ని తెలంగాణ కలలు ఉట్టిపడేలా డిజైన్ చేయడం ఆకట్టుకుంది. వరంగల్ కాకతీయ కళా తోరణం ఆకృతిలో ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం, తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావు ఫులే, ఆచార్య జయశంకర్ విగ్రహాలను సైతం ఏర్పాటు చేశారు. ద్వారానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టారు. బిఆర్ఎస్‌ను మళ్లీ టిఆర్ఎస్‌గా మార్చే ఆలోచన ఉందని ఇటీవలే ఓ సందర్భంలో కెటిఆర్ అన్నారు. ఇప్పుడు టిఆర్ఎస్ ఆవిర్భావంతో వారికి షాక్ తగిలినట్లు అయ్యింది. అంతేగాకుండా తండ్రిని, అన్నను ఆమె టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించారు. ఫాంహౌస్ వీడి కేసీఆర్ బయటకు రాకపోవడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నా. కేసీఆర్ రాజకీయ పరిణితి కోల్పోయారు. ప్రజల కోసం కొట్లాడాల్సిన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఎక్కడ?. అధికారం వచ్చాక ఆయన మమకారం కోల్పోయారు. మారిన మరబొమ్మ కేసీఆర్.

# మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

### మందమర్రి ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ

### వైద్య సిబ్బందికి ప్రశంసా పత్రాల అందజేత






**మందమర్రి,ఏప్రిల్ 25 (క్రైమ్ మిర్రర్):** మలేరియా, డెంగ్యూ వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాను మలేరియా రహితంగా నిలబెట్టడం లక్ష్యమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మందమర్రి మున్సిపల్ పరిధిలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అవగాహన పోస్టర్లను విడుదల చేసి వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దోమలే మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులకు ప్రధాన కారణమని తెలిపారు. “ఇప్పుడే చర్యలు చేపట్టాలి” అనే నినాదంతో జిల్లాలో మలేరియా నియంత్రణ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మున్సిపల్ అధికారులు,గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధుల సహకారంతో పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడం అత్యంత కీలకమని సూచించారు. వారానికి రెండుసార్లు డ్రై డే పాటించాలని, పాడైన బకెట్లు,టైర్లు,కొబ్బరి బొండాలలో నీరు నిల్వ ఉండకుండా తొలగించాలని పేర్కొన్నారు. కిటికీలకు జాలీలు అమర్చుకోవడం, దోమతెరలు వినియోగించడం ద్వారా వ్యక్తిగత రక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. జ్వరం వచ్చిన వెంటనే ఆశా కార్యకర్తల వద్ద ఉచిత రక్తపరీక్షలు చేయించుకుని ప్రభుత్వం అందించే మందులను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం మలేరియా కేసులు సున్నాగా ఉన్నాయని, అదే స్థితిని కొనసాగించేందుకు ప్రభావిత ప్రాంతాల్లో ముమ్మర ఆరోగ్య సర్వే నిర్వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అనంతరం పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి మున్సిపల్ అధికారులకు సూచనలు చేశారు. ప్రజలతో ముఖాముఖి నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. కీటక జనిత వ్యాధుల నివారణలో విశేష సేవలందించిన వైద్యులు,సిబ్బందికి కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రజలతో ఆరోగ్య ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్. అనిత, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుధాకర్ నాయక్, డాక్టర్ ఈ. ప్రసాద్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సీహెచ్‌ఓలు,వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రాజీవ్ స్మారక ఫౌండేషన్ ట్రస్టుచే ఆర్థిక సహాయం అందజేత



**చౌటుప్పల్,ఏప్రిల్ 25,క్రైమ్ మిర్రర్:** చౌటుప్పల మండలంలోని బంగారిగడ్డ, అంకిరెడ్డిగూడెం కు చెందిన నలుగురు నిరుపేదలకు ఒక్కొక్కరికి రూ. 10,000/- చొప్పున ఆర్థిక సహాయాన్ని శనివారం రాజీవ్ స్మారక ఫౌండేషన్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ మాధవరెడ్డి సహకారంతో అందజేశారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని బంగారుగడ్డ కాలానికి చెందిన జహంగీర్ ఖాన్,హసీనా బేగం లు, అలాగే అంకిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన పెండెం ఉమారాణి, ముద్దం నాగేష్ గౌడ్ లకు ట్రస్టు సభ్యులు ఎం.ఏ. ఖయ్యూం, నల్ల నర్సింహా, ఏసుదాస్, షాదీఖానా మాజీ చైర్మన్ హైజీజ్ పాషా, షాదీఖానా చైర్మన్ కరీం, వెంకటేష్ లు లబ్ధిదారులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు ఎం ఏ ఖయ్యూం మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు ట్రస్ట్ ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంకిరెడ్డిగూడెం గ్రామశాఖ అధ్యక్షులు బొమ్మగాని సాయిరాం గౌడ్, మాజీ సర్పంచ్ ముద్దం సుమిత్ర, సత్తయ్య గౌడ్,యాట శంకరయ్య, సుర్వి వెంకటేశం, ముద్దం రాజేష్, నల్ల లక్ష్మయ్య, పెండెం బాలరాజు, అంతటి వెంకటేశం, బొల్లు దత్తు తదితరులు పాల్గొన్నారు.

## దోమలను నివారించి మలేరియ లేకుండా చేద్దాం

### జిల్లా మలేరియ అధికారి డా . సుబ్బారావు




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఖమ్మం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ సుబ్బారావు ఆధ్వర్యంలో అర్బన్ మలేరియ సిబ్బంది దోమలు పుట్టకుండా కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియ అధికారి ప్రజలకు సందేశాన్ని ఇచ్చారు. దోమల పెరుగుదలను అరికట్టడం వల్ల మలేరియాను అంతం చేయగలమని ఆరోగ్యం మన హక్కు దానిని కాపాడుకోవడం మన బాధ్యత అని మలేరియా నివారణకు పాటించవలసిన ముఖ్యమైన చర్యలు ఇళ్లలో పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని నీటి ట్యాంకులు డబ్బాలు మూతలతో మూసి ఉంచాలని రాత్రి పూట దోమతెర వినియోగించాలని దోమల నివారణ కోసం జాగ్రత్తలు పాటిస్తూ దోమలను నివారించే మందులను మాస్కిటో బ్యాట్ ను వినియోగించాలని తగిన జాగ్రత్తలు తీసుకుంటే - మలేరియా దూరమవుతుందనిజ్వరం చలి వణుకు ఒళ్లు నొప్పులు వాంతులు అలసట వుంటే వెంటనే ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని మన సంకల్పం - మలేరియా రహిత భారత్ అని మన చర్యలు మన రక్షణ ఆరోగ్యకరమైన కుటుంబం - సురక్షితమైన సమాజం అని మలేరియ రాకుండా ప్రతి ఒక్కరూ కలసి కృషి చేద్దామని దోమల పెరుగుదలను ఆపుదాంమలేరియాను నిర్మూలిద్దాం తగిన జాగ్రత్తలు తీసుకుంటే మలేరియా తప్పక దూరమవుతుందని అయన తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వేణు గోపాల్ హెల్త్ ఇన్స్పెక్టర్ మహ్మద్ మన్నన్ ఇతగాని వెంకటేశ్వర్లు అర్బన్ మలేరియ సిబ్బంది పాల్గొన్నారు.



## దుచ్చెర్ల సత్యనారాయణ పరమర్శించిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు


**హైదరాబాద్, ఏప్రిల్ 25(క్రైమ్ మిర్రర్):** పర్యావరణ ప్రేమికుడు జలసాధన ఉద్యమ నాయకుడు ఫ్లోరైడ్ నివారణ కోసం తను జీవితాంతం పనిచేస్తున్న దుచ్చెర్ల సత్యనారాయణ మీద జరిగిన దాడిని ఖండిస్తూ గాయపడి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు చికిత్స పొందుతున్నటువంటి జిద్చర్ల సత్యనారాయణ యోగక్షేమాలు అడిగి తెలుసుకుని ఆయనను పరామర్శించిన నాయకులు తెలంగాణ రాష్ట్ర మాజీ కార్పోరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్, ప్రముఖ కవి గాయకుడు జయరాజ్, తెలంగాణ సర్పంచ్ల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ సంపత్ తదితరులు పాల్గొన్నారు

## మృతుడు పంతంగి మస్తాన్ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన సుదగానీ హరిశంకర్ గౌడ్

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 25:** గౌడ సంఘం యువజన నాయకులు పంతంగి ఉదయ్ కిరణ్ గౌడ్ తాత పంతంగి మస్తాన్ గౌడ్ ఇటీవల మృతి చెందగా మస్తాన్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన సుదగాని ఫౌండేషన్ చైర్మన్ సుదగాని హరి శంకర్ గౌడ్. అనంతరం ఉదయ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మోటకొండూరు సర్పంచ్ జయమ్మ శ్రీనివాస్, ఉపసర్పంచ్ వంగాల నికిత మహేందర్ గౌడ్, సుదగాని ఉదయ కిరణ్ గౌడ్, బత్తిని వెంకటేష్ గౌడ్, చందేపల్లి ఉప సర్పంచ్ ఏనుగు అంజిరెడ్డి, హరినాథ్ రెడ్డి, మల్లారెడ్డి, వెంకట్, శంకరాచారి, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# సిపిఐ మొటకోండూర్ మండల కార్యవర్గ సమావేశం




**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 25::** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండల కేంద్రంలో సిపిఐ కార్యాలయంలో మండల కార్యవర్గం సమావేశం కామ్రేడ్ మూసుకు పెంటా రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ పాల్గొని సంయుక్తంగా మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ సమ్మెలో భాగంగా పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని డ్రైవర్ కోలా శంకర్ గౌడు మృతి చెందడం జరిగింది. కార్మికుల సమస్యలపై పరిష్కారం కోసం అమరుడైన శంకర్ గౌడ్ కి సంతాపం తెలియజేస్తూ శంకర్ గౌడ్ కుటుంబానికి పగాడ సానుభూతి తెలిపారు. తెలంగాణలో జాతీయ ఉపాధి హామీ తరహా పథకం రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం కేంద్ర ప్రభుత్వం త్వరలోనే అమల్లోకి తీసుకురానున్న వికాసిత్ భారత్ గ్యారంటీ రాజ్గారి అజీవీక మిషన్ గ్రామీణ వి బి జి రామోజీ తో పాత మాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్ణయం అవుతుందన్న దానిని ఉప సవరించుకొని రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేస్తూ నా విషయం తెలిసిందే రాష్ట్ర ప్రభుత్వం చట్టాన్ని వ్యతిరేకిస్తున్నప్పుడు రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం అమలుకు కొత్త బిల్లును తీసుకురావాల్సిన అవసరం ఉందని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఉపాధి హామీ కోసం కృషి చేస్తున్న సంస్థలు కేంద్రం తెచ్చిన కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తూ చేతులు దులుపు పరిస్థితి రాకుండా దానిని ప్రత్యాయంగా ఒక నూతన పథకాన్ని బిల్లును రూపంలో తీసుకురావాలని సూచించాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 125 రోజులకు తగ్గకుండా తప్పనిసరిగా పతి కూలికి చేసిన పనికి సకాలంలో వేతనాలు చెల్లించాలి భారత రాజ్యాంగం కల్పించిన జీవనోపాధి కల్పన హక్కులకు సామాజిక భద్రత కల్పించాలి. ఉపాధి హామీలో పెండింగ్లా ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రేగు సిద్దయ్య సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం మండల కార్యవర్గ సభ్యులు ముసుకు పెంటారెడ్డి ఆలేటి బాలరాజు బోళ్ల శీను పల్లె వెంకన్న బీరకాయల మల్లేష్ మంచాల రాధమ్మ ఎండి శంషుద్దీన్ శనిగల భాగ్యమ్మ నల్ల రాములు జీవికులపల్లి పాండు తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా అన్నపురెడ్డి స్వర్ణల తభీమార్జున్‌రెడ్డి నియామకం

గండిపేట(క్రైం మిర్రర్): తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ బలమైన శక్తిగా ఎదుగుతుందని అన్నపురెడ్డి స్వర్ణలతభీమార్జున్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ కిస్మత్‌పూర్ ప్రాంతానికి చెందిన బీజేపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా నియమితులైయ్యారు. రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి, రాష్ట్ర మహిళా కమిటీని ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా రూరల్ ప్రాంతానికి చెందిన అన్నపురెడ్డి స్వర్ణలతభీమార్జున్‌రెడ్డి ప్రజాప్రతినిధిగా, సంఘ సేవకురాలిగా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ మహిళా విభాగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించారు. అంచలంచలుగా ఎదుగుతూ రాష్ట్ర కమిటీలో కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో పదవి అప్పగించినందుకు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రారావు, చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు రాజ్‌భూపాల్‌తో పాటు నాయకులు, కార్యకర్తలకు జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

క్రైమ్ మిర్రర్
తెలంగాణ జిల్లాలు
6 ఆదివారం 26-4-2026

# మహిళా బిల్లు బీజేపీ ఎన్నికల గారడీ

## సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం



**చౌటుప్పల్,ఏప్రిల్ 25, క్రైమ్ మిర్రర్ :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన పేరుతో దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కాలని చూస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం చౌటుప్పల్‌లోని సిపిఎం మండల , పట్టణ కమిటి ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ?"జనాభా నియంత్రణ పాటించి, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ , కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలకు డీలిమిటేషన్ ఒక శాపంగా మారబోతోందనీ అన్నారు. జనాభాను విచ్చల విడిగా పెంచిన ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెంచి, నిబంధనలు పాటించిన దక్షణాది రాష్ట్రాల సీట్లు తగ్గించడం అంటే అభివృద్ధిని అగౌరవపరచడమే అన్నారు .ఇది ముమ్మాటికీ దక్షిణాది రాష్ట్రాల రాజకీయ అస్తిత్వంపై కేంద్రం చేస్తున్న దాడి అని మల్లేశం విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. బిజెపి ప్రవేశపెట్టిన మహిళా బిల్లు ఒక ఎన్నికల గారడీ అని పేర్కొన్నారు."మహిళా బిల్లును -2023 సంవత్సరంలో పార్లమెంట్ ఆమోదించిన నుండి అమలు చేయకుండా చేతులు దులుపుకునీ ,జనాభా గణన, డీలిమిటేషన్ వంటి అంశాలకు ముడి పెట్టి మహిళలను బిజెపి ప్రభుత్వం మోసం చేస్తున్నదని విమర్శించారు. బిజెపి ప్రభుత్వానికి మహిళల పట్ల మొదటి నుండి చిత్తశుద్ధి లేదని అన్నారు. బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులైనటువంటి ఆదాని, అంబానీ లాంటి వారికి ప్రయోజనాలు కలిగించే చట్టాలను ప్రవేశపెట్టి దేశ ప్రజలను తాకట్టు పెడుతుందని అన్నారు.మహిళా శక్తిని కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్న బీజేపీ, తక్షణమే ఈ కోటాను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ డ్రామాలు ఆడుతోందని మండిపడ్డారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, అధికారాలన్నీ కేంద్రం వద్దే ఉంచుకోవాలనే 'ఏకఛత్రాధిపత్య' ధోరణిని సీపీఎం సహించబోదని హెచ్చరించారు. డీలిమిటేషన్ వల్ల పార్లమెంటులో దక్షిణాది గళం బలహీనపడితే, భవిష్యత్తులో నిధుల కేటాయింపులో కూడా తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఐక్యమై పోరాడాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడానికి సీపీఎం ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా ,రాయగిరి కిష్టయ్య, పట్టణ కార్యదర్శి గోశిక కరుణాకర్, సిపిఎం సీనియర్ నాయకులు ఆదిమూలం నందీశ్వర్ ,బొడ్డు అంజిరెడ్డి, సప్పిడి శ్రీనివాసరెడ్డి, తూర్పునూరు మల్లేశం, బోయ యాదయ్య, మహేష్, నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నూతన కమిటీ సభ్యునిగా రెండవసారి ఎన్నికైన గుడవర్తి నాగేశ్వరరావు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యునిగా మండలంలోని అనాసాగరం గ్రామానికి చెందిన గుడవర్తి నాగేశ్వరరావు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత మూడు రోజులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గుడవర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిపిన పోరాటాల ఫలితంగా అనేక సమస్యలను పరిష్కరించుకోగలిగామన్నారు. బిజెపి తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలను తిప్పి కొట్టిన ఘనత ఆల్ ఇండియా కిసాన్ సభ (తెలంగాణ రైతు సంఘం)కే దక్కిందన్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న రైతు రుణమాఫీ, క్వింటా ధాన్యానికి 500 రూపాయల బోనస్, రైతు భరోసా, ధాన్యం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి అనేక సమస్యలపై ఉద్యమించి కొంతమేర ఫలితాలు సాధించామన్నారు. భవిష్యత్తులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మరిన్ని పోరాటాలకు అవసరమైన కార్యాచరణను రూపొందించి ఉద్యమిస్తామన్నారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టే పోరాటాలు, ఉద్యమాలలో రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గుడవర్తి నాగేశ్వరరావు ఏకగ్రీవ ఎన్నిక పట్ల పలు పార్టీల నాయకులు, ప్రజాసంఘాల బాధ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# ఆస్తి పన్ను అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి...5% శాతం రాయితీ పొందండి

### ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి



**కూకట్ పల్లి, ఏప్రిల్ 25 (క్రైమ్ మిర్రర్) :** ప్రభుత్వం అందిస్తున్న ఎర్లీ బర్డ్ పథకం కింద ఆస్తి పన్నుపై 5% ప్రత్యేక రాయితీ లభిస్తున్నదని, ఈ గొప్ప అవకాశాన్ని ప్రజలు తప్పక వినియోగించుకోవాలని ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి తెలిపారు. ఈ రాయితీ కింద కింది డివిజన్ల పన్ను చెల్లింపుదారులు లాభపడవచ్చు: హైదర్ నగర్, భాగ్యనగర్, శంషిగూడ, ఆల్విన్ కాలనీ, వివేకానంద నగర్, వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలో ఎర్లీ బర్డ్ పథకం లక్ష్యం రూ. 30 కోట్లు కాగా, ఇప్పటికే రూ. 15 కోట్లు వసూలు కావడం విశేషం. ప్రజల సహకారం వల్ల మంచి స్పందన లభిస్తున్నదని అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక రాయితీ పొందడానికి ఈ నెల 30వ తేదీ చివరి గడువు మాత్రమే కాబట్టి, పన్ను చెల్లింపుదారులు ఆలస్యం చేయకుండా వెంటనే తమ ఆస్తి పన్నులు చెల్లించి 5% రాయితీ ప్రయోజనం పొందండి. "ప్రతి పౌరుడు తన బాధ్యతగా పన్ను చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలి" అని డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి పిలుపునిచ్చారు.

# స్వాన్ లేక్ లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్



**కూకట్ పల్లి, ఏప్రిల్ 25 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, ఖైతలపూర్ డివిజన్ పరిధిలోని స్వాన్ లేక్ గేటెడ్ కమ్యూనిటీ యొక్క నూతన కార్యవర్గ సభ్యులు టీపీపీసీ ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ దృష్టికి పలు సమస్యలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ స్వాన్ లేక్ గేటెడ్ కమ్యూనిటీని సందర్శించి అసోసియేషన్ సభ్యులతో పాటు సమస్యలను శనివారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు నాల వెడల్పు, రిటైనింగ్ వాల్ సమస్య, అండర్ గ్రౌండ్ ఎలక్ట్రికల్ లైన్ సమస్యలు బండి రమేష్ దృష్టికి తేవడంతో, తక్షణమే స్పందించిన ఆయన పరిష్కారం అయ్యే విధంగా సంబంధిత అధికారులకు మార్గదర్శకత్వం సూచించారు. భవిష్యత్తులో కూడా స్వాన్ లేక్ నివాసితులకు ఎటువంటి సమస్య వచ్చినా తక్షణమే వచ్చి పరిష్కార మార్గం చూపుతానని అసోసియేషన్ సభ్యులకు తెలపారు.

# గంటల వ్యవధిలోనే తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు

### ఆనందభాష్పాలతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన బాలుడి తల్లిదండ్రులు




**బాలానగర్, ఏప్రిల్ 25 (క్రైమ్ మిర్రర్) :** ఆడుకుంటూ వెళ్ళి దారి తప్పిన ఓ రెండేళ్ల చిన్నారిని, పోలీసులు అత్యంత వేగంగా స్పందించి తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. మానవత్వంతో స్పందించిన స్థానికులు, సాంకేతికతను జోడించిన పోలీస్ కానిస్టేబుల్ ఖదీర్, హెచ్ జి రత్నంల కృషితో ఒక కుటుంబంలో మళ్ళీ చిరునవ్వులు పూశాయి.బాలానగర్ సీఐ నర్సింహా రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గురుమూర్తి నగర్‌కు చెందిన చామంతి మహేందర్ కుమారుడు హేమేష్ (2 ఏళ్లు), శనివారం స్థానిక స్నేహితులతో ఆడుకుంటూ ఇంటి నుండి బయటకు వచ్చాడు. దారి తెలియక ఆదర్శనగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకున్న బాలుడు, అడ్రస్ తెలియక దిక్కుతోచని స్థితిలో అటూ ఇటూ తిరుగుతూ కనిపించాడు. బాలుడిని గమనించిన స్థానికులు వెంటనే 'డయల్ 100' ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన బాలానగర్ సిఐ నర్సింహా రాజు సిబ్బంది, బాలుడి ఫోటోను స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసి గాలింపు చేపట్టారు.వాట్సాప్ సందేశాన్ని చూసిన గురుమూర్తి నగర్ వాసులు, బాలుడి తండ్రి మహేందర్‌కు సమాచారం అందించారు. వెంటనే పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న తండ్రికి, అన్ని వివరాలు ఆరా తీసిన అనంతరం సిఐ నర్సింహా రాజు బాలుడిని అప్పగించారు. కుమారుడిని సురక్షితంగా చూసుకున్న తల్లిదండ్రులు ఆనంద బాష్పాలతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. బాలానగర్ పోలీసుల సాంకేతిక పరిజ్ఞానం, వేగవంతమైన చర్యలపై స్థానిక సంక్షేమ సంఘ సభ్యుల ప్రశంసలతో వెలువెత్తయి.

# అంగన్వాడి వేతనాలు పెంచాలి

### కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** సుబ్లేడ్ గ్రామంలో ప్రజా దర్బార్ కు హాజరైన రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేయడం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ వశపొంగు వీరన్న మంత్రి కు వివరిస్తూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే స్కీము వర్కర్లందరికి కనీస వేతనము ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టారని ఆ విషయాన్ని గుర్తు చేస్తూ మా బతుకులు బాగుపడతాయని కాంగ్రెస్ కు ఓటు వేసి గెలిపించుకున్నామని ప్రభుత్వం వచ్చి రెండున్నర సంవత్సరాల అవుతున్న ఇంతవరకు తమ వేతనాలు పెరగలేదని దయచేసి ఇప్పటికైనా కాలయాపన చేయకుండా అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ కు కనీస వేతన పెంచి వారి కుటుంబాలను ఆదుకోవాలని వారు విన్నవించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సారిక పుష్పవతి పద్మ గాయత్రి సునీత పద్మ రజిని తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి ఉదార విరాళాలు

### చెక్కుల రూపంలో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కు అందజేసిన భక్తులు



**కూకట్ పల్లి, ఏప్రిల్ 25 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రాంతంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి కోసం భక్తులు పెద్దఎత్తున విరాళాలు అందజేశారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో ఈ విరాళాల చెక్కులు సమర్పించారు.ఈ సందర్భంగా వివిధ కుటుంబాలు తమ భక్తిని చాటుతూ క్రింది విధంగా విరాళాలు అందజేశారు. విజ్ఞానపురి కాలనీకి చెందిన పి. రాజేష్ కుమార్ రెడ్డి, పి. వినీత దంపతులు రూ. 5,01,116 (ఐదు లక్షల ఒక వెయ్యి నూట పదహారు), కూకట్‌పల్లి వాసులు కంచనపల్లి నాగరాజు, పల్లవి దంపతులు రూ. 1,16,000 (లక్ష పదహారు వేలు) ఎస్. పవన్ కుమార్, శాలిని దంపతులు రూ. 1,01,116 (లక్ష ఒక వెయ్యి నూట పదహారు) చౌదరి సూర్యారావు, సులోచన దంపతులు రూ. 50,116 (యాభై వేల నూట పదహారు) ఎన్. శ్రీనివాసరావు (చిన్న తులసి) కి కూడా విరాళం అందజేశారు. ఈ విరాళాలను దేవస్థానం అభివృద్ధి, సదుపాయాల విస్తరణ, భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, భక్తుల సహకారం దేవాలయ అభివృద్ధికి ఎంతో అవసరమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మంది ముందుకు రావడానికి ప్రేరణ కలిగిస్తాయని పేర్కొన్నారు.

క్రైమ్ మిర్రర్
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రంగారెడ్డి జిల్లా, మండలవారీగా, షాద్నగర్ , కేశంపేట, కడ్తాల్, కందుకూరు, కొత్తూరు, తలకొండపల్లి అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈక్రింది నెంబరుకు సంప్రదించగలరు.
Email ID: crimemirrorts@gmail.com
9393 44 6188

క్రైమ్ మిర్రర్

# ఎడిటోరియల్

8 ఆదివారం 26-4-2026




కల్వకుంట్ల కవిత..ఈ పేరు పెద్దగా పరిచయం అక్కర్లేదు. తెలంగాణలో కవిత అంటే బతుకమ్మ అన్న స్థాయిలో ప్రాచుర్యం పొందారు. తెలంగాణ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా దివిటీ పట్టి వెలగించారు. తండ్రి కెసిఆర్ ఒడిలో రాజకీయ ఓనమాలు దిద్దుకున్న కవిత..ఇవాళ తండ్రి పార్టీని ధిక్కరించి.. తండ్రినే ఎదిరించి.. నిలదీసే స్థాయిలో..కొత్తగా పార్టీని ప్రకటించి పాంచజన్యం పూరించారు. ఒక్కరోజు తేడాలో పాత టిఆర్ఎస్ అవిర్భావ దినోత్సవం జరుగనుంది. దానికి రెండ్రోజుల ముందు కవిత తన పార్టీ కోసం ఎంచుకున్న తేదీ యాదృచ్ఛికం కాకపోయినా...ముహూర్త బలం ఉండేవుంటుంది.

ఓ మహిళగా కవిత మహిళా లోకానికి బాగా తెలుసు. బతుకమ్మతో తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటారు. తెలంగాణ ఉద్యమం లో మమేకం అయ్యారు. తెలంగాణ ఏర్పడితే అందరూ బాగుపడతారని నమ్మి అంతా కెసిఆర్ జెండా మోసారు. కానీ తెలంగాణ ఆగమయ్యింది. కెసిఆర్ కుటుంబం బాగుపడ్డది. అవినీతిలో ఆరితేరారు. లక్షల కోట్లు వెనకేసుకున్నారు. ఈ అవినీతి, తెలంగాణ ఆకాంక్షలను పక్కదారి పట్టించిన తీరుతోనే కెసిఆర్ పార్టీని ప్రజలు బొందపెట్టారు. టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చాక ఉన్న పేగుబంధం కూడా తెగిపోయింది. బిఆర్ఎస్ అవినీతిని ఎదిరించిన రేవంత్ రెడ్డి కూడా ఇప్పుడు అదే దారిలో ప్రయాణిస్తున్నారు. రెండున్న రేళ్లు కావస్తున్నా..ఒక్కటంటే ఒక్క నిర్మాణాత్మక పని చేయలేదు. రేషన్ కార్డులు ఇచ్చాం..సన్న బియ్యం ఇచ్చాం..ఇదే పల్లవి. కానీ ప్రజల బాధ మరోలా ఉంది. ధాన్యం కొనడం లేదు. గిట్టుబాటు ధరలు రావడం లేదు. ఉద్యోగాలు దక్కడం లేదు. అవినీతి పెరిగింది. పైసా ఇవ్వనిదే ఫైలు కదలడం లేదు. కిందిస్థాయి నుంచి మంత్రుల వరకు అవినీతి అంటూ ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పేదల ఇళ్లను కూల్చేస్తున్నారు. వెలుగమట్ల ఘటన ఒక్కటి చాలు..పేదలను ఎంతగా రాచి రంపాన పెట్టారో అర్థం చేసుకోవచ్చు. 50శాతం ఉన్న మహిళలు. 50 శాతం ఉన్న దళిత,గిరిజన, బహుజనులకు రాజ్యాధికారంలో చోటులేదు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ...తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భావం అన్నది ఒక అవసరం. ఆవశ్యకత కూడా ఉంది. ప్రజల పక్షాన పోరాడాల్సిన పార్టీ ఒకటి ఇప్పుడు తక్షణా వసరంగా ఉంది. ఎందుకంటే రాజకీయ పార్టీలన్నీ తమ సొంత ఎజెండాతో పనిచేస్తున్నాయి. సొంత వ్యవహారాల కోసం పనిచేస్తున్నాయి. అన్నింటికి మించి అవినీతి, ఆశ్రిత పక్షపాతంలో కూరుకుపోయాయి. కేంద్రంలో అధికారం లో ఉన్న బిజెపి కూడా తెలంగాణకు చేసిందేమీ లేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ ఊదరగొట్టుడే తప్ప నిలబడి తెలంగాణ పురోగతికి చేసిందేమీ లేదు. నిత్యం విమర్శలు తప్ప మరో ఎజెండా దానికి లేదు. అందుకే గత ఏడాదిగా ప్రజల్లో తిరుగుతూ..వారి సమస్యలను వింటూ..సమస్యలపై పోరాడుతూ వస్తున్న కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు.


# పాంచజన్యం పూరించిన కవిత !

గతంలో ఓమారు పార్టీ పెడతామని ప్రకటించిన సమయంలో పార్టీ పేరు గురించి అడిగితే ..అప్రయత్నంగానే టిఆర్ఎస్ పేరు కూడా ఖాళీగా ఉందన్నారు. అయితే అంతా టిఆర్ఎస్ పేరును ఓన్ చేసుకుంటుందని భావించారు. కానీ తెలివిగా టిఆర్ఎస్‌నే ప్రకటించినా..తెలంగాణ రాష్ట్రసేనగా ప్రకటించి ఆశ్చర్య పరిచారు. ఇది ఓ రకంగా బిఆర్ఎస్ పార్టీకి షాక్ లాంటిదే. టిఆర్ఎస్ పార్టీని పునరుద్ధరించాలనుకున్న ఆ పార్టీకి ఇదో అశనిపాతం లాంటిదే .నిజానికి గత టిఆర్ఎస్‌లో ఉంటూ.. తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి.. పిడికిలి బిగించి కొట్లాడామన్న కవిత మాటలు ముమ్మాటికీ నిజం. జాగృతి ద్వారా తెలంగాణ సాంస్కృతిక దీపాలను వెలిగించారు. తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి వెలుగునిచ్చింది. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారింది. మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నామంటే అందులో కవితనే కనిపిస్తారు. నిజానికి తెలంగాణ తెచ్చుకుంటే దరిద్రం పోతుందన్న భావనలో ఉండి పోరాడిన వారంతా ఆగమయ్యారు. ఆ కలలు నిజం కాలేదు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయింది. సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైంది. కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించిన వారంతా భంగపడ్డారు. పోరాటంలో ముందున్న కోదండరామ్ లాంటి వారు బయటకు తోయబడ్డారు. ఆయనే మరో పార్టీ పెట్టాల్సి వచ్చింది. కానీ ప్రజల మద్దతుల లేకపోవడంతో ఆయన ఇప్పుడు ఉనికి కోసం పాకులాడుతున్నారు. కాంగ్రెస్ చేస్తున్న అక్రమాలను ప్రశ్నించే శక్తి కూడా లేకుండా పోయింది. తెచ్చుకున్న తెలంగాణలో రైతులకు బేడీలు పడ్డాయి.. లాఠీలు విరిగాయి. ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారు. ఫోన్లు ఎక్కడ వింటున్నారోనని భయం గుప్పిట్లో బతికారు. వ్యక్తిగత స్వేచ్ఛ లేదు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బిక్కుబిక్కుమంటూ బతికింది. ఇవన్నీ కళ్లముందు కదలాడుతున్నాయి. బిఆర్ఎస్ పోయి కాంగ్రెస్ వచ్చినా మార్పు రాలేదు. మార్పు తెచ్చామని, స్వేచ్ఛను ఇచ్చామని ప్రకటించుకున్నా..అది సాకారంకాలేదు. సామాజిక తెలంగాణ అన్నది నినాదంగా మారింది. తెలంగాణలోని 3.5 కోట్ల మందికి అమ్మగా పరిణతి చెందాలనుకుంటున్న కవిత కష్టపడితే..ఆ పేరు సంపాదించుకోవచ్చు. కేవలం నినాదాల కోసం కాకుండా ప్రజలను అక్కున చేర్చుకునే అమ్మగా మారితే ప్రజలు బ్రహ్మరథం పడతారు. తెలంగాణ ప్రజలు నమ్మితే ప్రాణం ఇస్తారు. ఉద్యమకారులు పోరాడితేనే కొత్త రాష్ట్రం వచ్చింది. అది గుర్తించి కవిత అడుగుల వేయాల్సి ఉంటుంది. మాటలు చెప్పడం వేరు, అందుకు అనుగునంగా అడుగుల వేయడం వేరు. రాజకీయాల్లో చిరస్థాయిగా నిలవాలంటే నిబద్ధత ముఖ్యం. నిజాయితీ అవసరం. నిలబడే ధైర్యం కావాలి. ప్రజలను ఆకట్టుకునే ప్రసంగాలే కాదు..పనులు చేసే ధైర్యం కనిపించాలి. కవిత ప్రకటించిన ఐదు సూత్రాలను ఆచరణలో పెడితే అద్భుతాలు సాధించవచ్చు. అందుకు కావాల్సిందల్లా ప్రజల పక్షాన పోరాడడం. ఎన్నికలకు మరో రెండేళ్లు గడువు ఉంది. మహిళా రిజర్వేషన్లు కూడా వస్తున్నాయి. మహిళలను, బడుగు బలహీనవర్గాలను రాజ్యాధికారంలో భాగం చేసేలా ప్రణాళికలు రచిస్తే కవిత తప్పకుండా విజయం సాధిస్తారు. రాజకీయ పార్టీగా ముందు నిలబడతారు. అవినీతి లేకుండా సాగుతారన్న నమ్మకం కూడా ముఖ్యం. అందుకు వీరిందరినీ కలుపుకుని పోవడంతో పాటు, గుంటనక్కలను ఎదుర్కొనే చాణక్యం కూడా ముఖ్యం.

# ఒంటిపై పెట్రోల్.. కంట్లో ఆవేదన

## ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఎన్ని బలులు?

**తెలంగాణ గడ్డపై అయినా, ఆంధ్రప్రదేశ్ తీరంలో అయినా నేడు ఎక్కడ చూసినా ఒకటే దృశ్యం. హక్కుల కోసం పోరాటం, గొంతు విప్పిన కార్మికుడు, చెమట చిందించే రైతు, భవిష్యత్తు కోసం తపించే విద్యార్థి. వీరంతా రోడ్లపైకి రావడం కొత్తేమీ కాదు. కానీ, ఈ నిరసనల రూపురేఖలు మారుతున్నాయి. శాంతియుత ధర్నాలు కాస్తా ఆత్మబలిదానాల వైపు మళ్లుతున్నాయి. మండపాలపై నిలబడి ఒంటిపై పెట్రోల్ పోసుకోవడం, వేలాది మంది చూస్తుండగా విషపు చుక్కలను గొంతులోకి వంపుకోవడం ఇవి కేవలం సంఘటనలు కావు, మన సమాజపు మానవత్వంపై పడుతున్న మచ్చలు. ఒక మనిషి తన డిమాండ్‌ను విన్పించడానికి ప్రాణాన్ని పణంగా పెట్టాల్సి వస్తోందంటే, మనం ఎంతటి దౌర్భాగ్య స్థితిలో ఉన్నామో ఒక్కసారి ఆగి ఆలోచించాలి.**



గత కొన్నేళ్లుగా సాగుతున్న వివిధ సమ్మెలను, ఉద్యమాలను నిశితంగా పరిశీలిస్తే ఒక ఆందోళనకరమైన 'పాటర్న్' కనిపిస్తోంది. మొదట చిన్నగా మొదలయ్యే విన్నపాలు, తర్వాత వినతులుగా మారి, చివరకు వీధి పోరాటాలుగా మారుతాయి. ఉద్యోగులు, రైతులు తమ గోడును ప్రభుత్వాలకు చెప్పుకోవడానికి ప్రయత్నిస్తారు. కానీ, అధికార పీఠాల చెంత ఉన్నవారికి ఆ శబ్దాలు వినపడవు. మీడియా కూడా రేటింగ్స్ రాని పక్షంలో ఆ గొంతుకలను విస్మరిస్తుంది. అప్పుడు ఆ నిరసనకారుడికి కలిగే నైరాశ్యం వర్ణనాతీతం. నేను బతికి ఉంటే నా మాట వినడం లేదు, కనీసం నా చావు చూసైనా ఈ వ్యవస్థ కళ్లు తెరుస్తుందేమో అన్న ఒక భయంకరమైన తర్కం వారిని ఆత్మహత్య వైపు నడిపిస్తోంది. ఈ ఆత్మహత్య ప్రయత్నాలు ఆ క్షణానికి బ్రేకింగ్ న్యూస్ అవుతాయి. మంత్రులు స్పందిస్తారు, కమిటీలు వేస్తారు. కానీ, సమస్య మూలాల్లోకి వెళ్లి పరిష్కరించే నాథుడే కరువయ్యాడు. సమ్మె చేయటానికి ముందు ప్రాణాలు పోగొట్టుకోవాలని ఆలోచించాల్సి వస్తే అది ప్రజాస్వామ్యానికి మచ్చ మాత్రమే కాదు, అది ప్రజల గొంతుకను శాశ్వతంగా నొక్కివేసే కుట్ర అని మనం గట్టిగా నమ్మాలి.

ప్రజాస్వామ్యంలో నిరసన అనేది ఒక పవిత్రమైన ఆయుధం. అది అహింసాయుతంగా ఉండాలని మహాత్మా గాంధీ బోధించారు. కానీ, నేడు ఆ అహింస తనపై తాను చేసుకునే హింసగా రూపాంతరం చెందుతోంది. రేపు ఒక సామాన్య ఉద్యోగి తన హక్కు కోసం పోరాడాలంటే, నేను కూడా చనిపోవాలేమో అన్న భయం అతడిని వెనక్కి లాగుతుంది. ఇలా భయంతో నిరసనను అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం. ఒక వ్యక్తి తన ప్రాణాన్ని వదులుకుంటున్నాడంటే అందుకు బాధ్యత కేవలం ఆ వ్యక్తిదేనా? ఖచ్చితంగా కాదు. ఆ వ్యక్తిని ఆ స్థితికి నెట్టిన వ్యవస్థది, వినపడనట్లు నటించిన ప్రభుత్వాలది, కేవలం శవాల దగ్గరే కెమెరాలు పెట్టే మీడియాది కూడా ఈ బాధ్యతలో భాగం ఉంటుంది. ఉద్యోగులు, రైతులు కరుడుగట్టిన నేరస్థులు కాదు. వారు కష్టపడి పని చేసే జీవులు. వారిలో ఉండే ఆత్మగౌరవం దెబ్బతిన్నప్పుడు, తమను మనుషులుగా కాకుండా కేవలం ఓట్లు గా చూస్తున్నారని అర్థమైనప్పుడు కలిగే అవమానం వారిని బలవన్మరణాలకు ప్రేరేపిస్తుంది. ప్రభుత్వాలు మీరు చర్చలకు రండి అని ఆజ్ఞాపించడం కంటే, మీ బాధ మాకు తెలుసు, కూర్చుని పరిష్కరించుకుందాం అనే మానవీయ కోణాన్ని ప్రదర్శించాలి. బల్లపై కూర్చుని మాట్లాడే సంస్కృతి కరువవ్వడం వల్లే ఈ దుఃఖ పర్వం కొనసాగుతోంది. ఒక నిరసనకారుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు మీడియా చూపించే అత్యుత్సాహం, ఆ తర్వాత మౌనం వహించడం అత్యంత దారుణం.

మూడు రోజుల పాటు ఆ వార్తను ఊదరగొట్టి, ఆ తర్వాత గాలికి వదిలేయడం వల్ల అసలు సమస్య పరిష్కారం కాకపోగా, బాధితుల కుటుంబాలు మరింత కుంగిపోతున్నాయి. మీడియా బాధ్యత కేవలం సంఘటనలను చూపడం కాదు, ఆ సంఘటన వెనుక ఉన్న ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టడం. నిరసనల సెగ చల్లారిన తర్వాత కూడా వాటిని సజీవంగా ఉంచి, తార్కిక ముగింపు వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. అలాగే, సమాజం కూడా తన పాత్రను మర్చిపోతోంది. ఎవరో చనిపోతే సోషల్ మీడియాలో '=ఖ' అని పెట్టి చేతులు దులుపుకోవడం కాదు. ఆ వ్యక్తి ఏ ఆశయం కోసం ప్రాణాలర్పించారో, అది నెరవేరే వరకు మనం కూడా వారి వెన్నంటి ఉండాలి. ఆత్మహత్య చేసుకున్న నిరసనకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇవ్వడం, వారి పిల్లల చదువుల బాధ్యత తీసుకోవడం వంటివి సమాజం చేయాల్సిన పనులు. అప్పుడే ఆ త్యాగానికి ఒక అర్థం పరమార్థం ఉంటుంది. భారత రాజ్యాంగం మనకు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను ఇచ్చింది. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును ప్రసాదించింది. కానీ, ప్రభుత్వాలు ఈ హక్కులను కాలరాస్తున్నాయి. సమ్మె చేస్తే జీతాలు కోయడం, క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం, జైలుకు పంపడం ఇవన్నీ చేస్తూ సమస్యను పక్కదారి పట్టిస్తున్నాయి. శిక్షించడంలో ఉన్న శ్రద్ధ, సమస్యను పరిష్కరించడంలో ఎందుకు ఉండటం లేదనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

ఒకసారి నిరసన తెలిపితే విఫలం కావచ్చు, రెండోసారి చేస్తే ఫలితం లేకపోవచ్చు. కానీ మూడోసారి ప్రాణాలనే పణంగా పెట్టే స్థితి రాకూడదు. విఫలమైన నిరసనకారుడికి కూడా మళ్ళీ లేచి నిలబడే ఆత్మవిశ్వాసాన్ని ఈ వ్యవస్థ కల్పించాలి.

నిరసనల్లో పాల్గొంటూ అసువులు బాసిన ప్రతి ఒక్కరికీ మనం ఇచ్చే నిజమైన నివాళి వారు పోరాడిన కారణాన్ని గెలిపించడమే. వారి పేర్లు చరిత్రలో కేవలం సంఖ్యలుగా మిగిలిపోకూడదు. ఆ మరణాలు భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు రాకుండా అడ్డుకునే పాఠాలు కావాలి. ప్రభుత్వాలు చర్చలను బలహీనతగా కాకుండా, ప్రజాస్వామ్య బలంగా భావించాలి. నిరసనకారులకు మానసిక స్థైర్యాన్ని ఇచ్చేలా కౌన్సిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. సమ్మె కాలంలో ఆర్థికంగా చితికిపోయే కుటుంబాలకు అండగా ఉండే వ్యవస్థలు రావాలి. ముఖ్యంగా మన మేధావి వర్గం, న్యాయవాదులు, విద్యావేత్తలు తమ రాజకీయ రంగులను పక్కనపెట్టి, న్యాయం ఎటు ఉంటే అటు మాట్లాడాలి. ప్రభుత్వం చేసే తప్పులను తప్పు అని చెప్పగలిగే దమ్మున్న పౌర సమాజం కావాలి. సమ్మె చేస్తున్న వారిలో ఎవరైనా కుంగిపోతుంటే, తోటి సహచరులు వారిని గుండెలకు హత్తుకుని ధైర్యం చెప్పాలి. నీ ప్రాణం కంటే ఏ డిమాండ్ పెద్దది కాదు అని గుర్తు చేయాలి. చివరగా, కష్టాల్లో ఉన్న నిరసనకారులకు ఒకే ఒక విన్నపం. ఆవేశంలో ఆత్మహత్య ప్రయత్నాలు చేయకండి. మీ ప్రాణం మీ కుటుంబానికి నిధి, మీ బిడ్డలకు కొండంత అండ. మీరు చనిపోతే మీ సమస్యకు పరిష్కారం రాదు, కేవలం మీ కుటుంబం వీధిన పడుతుంది. ప్రభుత్వాలు మారతాయి, పాలకులు మారుతారు, కాలక్రమేణా డిమాండ్లు కూడా నెరవేరవచ్చు. కానీ పోయిన ప్రాణం తిరిగి రాదు. నువ్వు జీవించి ఉండి చేసే పోరాటం, నువ్వు గెలిచి చూపే విజయం అదే నిన్ను అవమానించిన వ్యవస్థకు ఇచ్చే అతిపెద్ద సమాధానం. మరణం సమస్యకు ముగింపు కాదు, పోరాటమే గమ్యానికి దారి. ఆత్మవిశ్వాసంతో అడుగు వేయండి, ప్రపంచం నీ వైపు చూసేలా పోరాడండి, కానీ ప్రాణాన్ని మాత్రం వదులుకోకండి. మీ జీవితమే మీరు చేయగలిగే అత్యంత శక్తివంతమైన నిరసన.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# కవిత 'పాంచజన్యం'

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** పదునైన మాటలతో, ఆయుధం లాంటి రాజకీయ వ్యూహంతో తెలంగాణ పాలిటిక్స్ లో పూర్తిస్థాయి నాయకురాలిగా అడుగుపెట్టారు కల్వకుంట్ల కవిత. ఆవిర్భావ సభలో ఆమె చేసిన ప్రసంగం రాజకీయ విశ్లేషకులకు సైతం ఆశ్చర్యం కలిగించింది. ఆమె కేవలం భావోద్వేగాన్ని మాత్రమే ప్రదర్శించలేదు. కెసిఆర్ కు అసలు సిసలైన వారసురాలిగా ఆమె ప్రదర్శించిన మాటల తీరు అందర్నీ ఆకట్టుకుంది. ముఖ్యంగా ఈ సభలో 'పాంచజన్యం' పేరుతో ఐదు ప్రధాన హామీలను ప్రకటించారు.

1. ఐదు హామీల్లో ప్రధానమైనది విద్య. ప్రైవేటు పాఠశాలల్లో సైతం ఉచిత విద్య అందిస్తామని కవిత ప్రకటించారు. అన్ని పాఠశాలల్లో ఉచిత విద్యను అమలు చేస్తామని చెప్పుకొచ్చారు. 2. వైద్యాన్ని సైతం అన్నిచోట్ల ఉచితం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులను తేడా లేకుండా అన్ని రుగ్మతలకు ఉచిత వైద్యం అందించాలన్నది తమ పార్టీ సంకల్పంగా చెప్పుకొచ్చారు.
3. రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ తో పాటు సాగు ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. యూరియాతోపాటు ఎరువులను ఇంటి వద్దకే సరఫరా చేస్తామని చెప్పారు.
4. యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ పార్టీ లక్ష్యంగా చెప్పారు. నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలకు ఎదురు చూడకుండా ఉపాధి కల్పనపై దృష్టి పెడితే రూ.2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు అందిస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన మొదటి యాడాదిలోనే నాలుగు లక్షల ఉద్యోగాల భర్తీ ఉంటుందని ప్రకటించారు.
5. సామాజిక న్యాయం పాటించి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు సమాన అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆదివాసీ లంబాడాల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్లు, సొంత ఇంటి కలను నెరవేర్చుతామన్నారు.

# షర్మిలకు షాక్!

సుంకర పద్మశ్రీ పేరు వినిపిస్తోంది. షర్మిల నియామకం జరిగి మూడేళ్లు అవుతున్న తరుణంలో ఆమెను మార్చేస్తారని పొలిటికల్ సర్కిల్లో ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ సీనియర్లు నుంచి వెళ్లిన ఫిర్యాదులు నేపథ్యంలో ఆమెను తప్పిస్తారన్న టాక్ నడుస్తోంది. 2024 ఎన్నికలకు ఏడాది ముందు షర్మిల ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. అయితే గత మూడేళ్లలో కాంగ్రెస్ పార్టీ పెద్దగా బలోపేతం అయింది లేదు. పార్టీ హైకమాండ్ ఊహించినంతగా మార్పులు లేవు. అందుకే షర్మిలను మార్చుతారన్న ప్రచారం పెద్ద ఎత్తున నడుస్తోంది.

**తెలంగాణ నుంచి ఏపీకి..**

తెలంగాణలో తన తండ్రి పేరుతో పార్టీని స్థాపించారు షర్మిల. తెలంగాణలో పాదయాత్ర కూడా చేశారు. కానీ తెలంగాణ ప్రజలు పెద్దగా ఆదరించలేదు. దీంతో తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేశారు షర్మిల. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని చూశారు. కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇస్తుందని భావించారు. కానీ కాంగ్రెస్ హై కమాండ్ మాత్రం ఏపీ పగ్గాలు అందించేందుకు నిర్ణయించింది. అలా ఏపీ బాధ్యతలను తీసుకున్నారు షర్మిల. కానీ కాంగ్రెస్ పార్టీ పరంగా షర్మిల అధ్యక్షురాలు అయిన తర్వాత కలిసి రాలేదు ఆ పార్టీకి. కానీ షర్మిల అనుకున్న మాదిరిగా తన సోదరుడు జగన్మోహన్ రెడ్డికి భారీ డ్యామేజ్ చేయగలిగారు. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసిన జగన్మోహన్ రెడ్డిని దెబ్బతీయ గలిగారు.

**సీనియర్లపై వివక్ష..**

కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సీనియర్లను కలుపుకొని వెళ్లడం లేదన్న విమర్శ షర్మిలపై ఉంది. వాస్తవానికి 2014 రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో కాంగ్రెస్ పార్టీ దారుణంగా దెబ్బతింది. ఆపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటుతో కాంగ్రెస్కు చాలా నష్టం జరిగింది. దాని నుంచి అధిగమించి పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చే బాధ్యతను షర్మిలకు అప్పగించింది కాంగ్రెస్ హై కమాండ్. అయితే షర్మిల అధ్యక్షురాలు అయ్యాక చాలామంది సీనియర్లు పార్టీ నుంచి బయటకు. ఉన్నవారు సైతం ఫుల్ సైలెన్స్ పాటిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కొంతమంది సీనియర్లు షర్మిల నాయకత్వాన్ని మార్చాలని హై కమాండ్ కు ఫిర్యాదులు చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. దీనిపై అధిష్టానం సైతం సీరియస్ గా ఆలోచిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

**ప్రముఖంగా సుంకర పద్మశ్రీ పేరు..**

2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దారుణ పరాజయంతో ఆ పార్టీకి చాలామంది నేతలు దూరమయ్యారు. అటువంటి సమయంలో మహిళా నేతగా ఉన్న సుంకర పద్మశ్రీ చాలా యాక్టివ్ గా ఉండేవారు. ఆమెకు రాష్ట్ర పగ్గాలు అప్పగిస్తారని ప్రచారం నడిచింది. ఇంతలోనే అనూహ్యంగా షర్మిల తెలంగాణ రాజకీయాలను వీడి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. అలా సుంకర పద్మశ్రీ కి రావాల్సిన ఛాన్స్ ను షర్మిల కొట్టేశారు. అప్పటినుంచి సుంకర పద్మశ్రీ షర్మిలపై అసంతృప్తి గానే ఉన్నారు. ఆమె సైతం ఎప్పటికప్పుడు షర్మిల తీరుపై కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదులు చేస్తున్నారు. అయితే ఈసారి షర్మిల మార్పు ఖాయమని.. తాను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అవుతానని సుంకర పద్మశ్రీ బాహాటంగానే చెబుతున్నారు. మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.